
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శనివారం 15 ఫిబ్రవరి 2025





అర్ధంతరంగా ఆగిన వాటర్ ట్యాంకు నిర్మాణం

ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి ఏర్పాటు చేయాలి. తద్వారా ఆడబిడ్డలు నీటి కోసం పంపు సెట్లు, వ్యవసాయ బోర్లు, చేతిపంపుల వద్దకు వెళ్లి తాగునీటిని తెచ్చుకునే ఇబ్బంది ఉండదు. ఈ నేపథ్యంలోనే 2017 సంవత్సరంలో అప్పటి, ఇప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రోళ్లమడుగు నీటి పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం పనులు పూర్తయితే మండల వ్యాప్తంగా రోళ్లమడుగు నుంచి పైపులైను ఏర్పాటు చేసి తాగునీటి ట్యాంకులు నిర్మించి ప్రతి ఊరిలో, ప్రతి ఇంటి ముందు తాగునీటి కుళాయి ద్వారా నీటిని అందించాలన్నదే లక్ష్యం. ఈ క్రమంలోనే అప్పట్లో పనులు ప్రారంభించి సగానికి పైగా పనులు పూర్తి చేశారు. అనంతరం వైసీపీ ప్రభుత్వం రావడంతో పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. దాదాపు 252 పల్లెల ప్రజలు తాగునీటి కోసం ఎదురుచూస్తున్నారు. ముంచుకొస్తున్న తాగునీటి ఎద్దడితో భయాందోళన చెందుతున్నారు.

ఐదేళ్లు కక్ష సాధింపు



2017లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు సీఎం చంద్రబాబునాయుడు రోళ్లమడుగు నీటి పథకాన్ని ప్రారంభించారు. అప్పట్లో చాలావరకు పనులు పూర్తయ్యాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ కక్షతో ఈ నీటి పథకాన్ని నిలిపివేశారు. అప్పట్లో ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం కూడా మండలానికి శాపంగా మారింది. త్వరగా మండల ప్రజలకు తాగునీటిని అందించాలి.

- ఆంజనేయులునాయుడు, పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి

ప్రారంభించారు సరే..
పూర్తి చేసేదెన్నడు..?

- కలగానే రోళ్లమడుగు నీటి పథకం
- టీడీపీ హయాంలో ప్రారంభించారని పక్కన పెట్టేశారు
- 252 పల్లెలు ఎదురుచూపు
- ముంచుకొస్తున్న తాగునీటి ఎద్దడి



రోళ్లమడుగులో నిర్మించిన పంపు



కొలిమిట్ల వరకు నిర్మించిన పైపులైన్

సుండుపల్లె, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజలకు రోళ్లమడుగు నీటి పథకం శాపంగా మారింది. అప్పట్లో టీడీపీ ప్రభుత్వం నీటికొరత లేకుండా చూడాలనే ఉద్దేశ్యంతో పనులు ప్రారంభించినా.. మధ్యలోనే ఆగిపోయాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కనీసం రోళ్లమడుగు నీటి పథకాన్ని పూర్తి చేయాలనే ఆలోచన కూడా లేకుండా పక్కన పెట్టేశారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో మండల వ్యాప్తంగా పలు గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోనైనా పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేసి మండల ప్రజలకు తాగునీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.50 కోట్లతో పనులు ప్రారంభం

రోళ్లమడుగు నీటి పథకం కరువు సీమలో ప్రజల దాహార్తి తీరుస్తుందని ఎదురు చూస్తున్న ప్రజలకు నిరీక్షణే మిగులుతోంది. 8 సంవత్సరాల కిందట టీడీపీ ప్రభుత్వంలో వెనుకబడిన ప్రాంతాలకు కేటాయించిన అభివృద్ధి నిధుల నుంచి రూ.50 కోట్లతో రోళ్లమడుగు నీటి పథకం మంజూరైంది. 2018 నాటికి పూర్తి కావాలన్నది లక్ష్యమైనా పనులు పూర్తి కాలేదు. కొన్ని పనులు పూర్తి కాగా వాటికి రూ.16 కోట్ల చెల్లింపులు జరిగాయి. ఆ తర్వాత గడువు దాటిపోవడంతో నిధులు నిలిచిపోయాయి. రోళ్లమడుగు పథకం ప్రారంభంలో 163 పల్లెలకు తాగునీరు అందించడమే లక్ష్యం కాగా జీఎస్టీ రావడం, నూతన ధరల కారణంగా పనులు ప్రారంభమయ్యే సమయానికి లక్ష్యం 86 పల్లెలకు పరిమితమైంది. ఇప్పటి వరకు రోళ్లమడుగు సమీపంలో బాహుదా నదిలో రెండు ఇన్ఫిల్ట్రేషన్ బావులు, ఒక కలెక్షన్ బావి నిర్మాణం, ఫుట్ బ్రిడ్జి నిర్మాణం మాత్రమే పూర్తయ్యింది. విద్యుత్ సరఫరాకు అవసరమైన విద్యుత్ నియంత్రికలు ఏర్పాటు చేశారు. కొంతమేర ప్రధాన పైపులైన్ల నిర్మాణం పూర్తయింది. పది ఉపరితల ట్యాంకుల నిర్మాణం ప్రారంభమై అర్ధంతరంగా ఆగాయి. 1700 కిలో లీటర్ల సంప్ నిర్మాణంతో పాటు సానిపాయి సమీపంలో ఒక జీఎల్ఆర్ నిర్మాణం కావాల్సి ఉంది.

నిరుపయోగంగా ట్యాంకులు, పైపులైన్లు

నీటి పథకం పనుల్లో భాగంగా నిర్మించిన వాటర్ ట్యాంకులు, పైపులైన్లు నిరుపయోగంగా ఉన్నాయి. రోళ్లమడుగు నుంచి కొలిమిట్ల వరకు పైపులైన్ పనులు పూర్తయ్యాయి. పనులు ఆగిపోవడంతో పైపులైను తుప్పు పడుతోంది. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వంలో కనీసం రూ.40 కోట్లు వెచ్చించి ఉంటే సుండుపల్లె మండలంలో సుమారు 100 పల్లెలకు తాగునీటిని అందించే అవకాశం ఉండేది. అయితే టీడీపీ ప్రభుత్వంలో ప్రారంభించారనే కోపంతో ప్రజలపై కక్ష సాధింపు చేశారని ప్రజలు, ప్రజాసంఘాలు, రాజకీయ నాయకులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. మండల వ్యాప్తంగా పలు ట్యాంకుల నిర్మాణాన్ని ప్రారంభించారు. ట్యాంకుల నిర్మాణం దాదాపు పూర్తయింది. పూర్తయిన ట్యాంకుల నిర్మాణం అర్ధంతరంగా ఆగిపోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఇదంతా గత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవేనని కూటమి నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వెలిగల్లు ప్రాజెక్టు నుంచి తాగునీరు..

రోళ్లమడుగు నీటి పథకం పనులు పూర్తి చేయాలన్న సంకల్పంతో ప్రతిపాదనలు పంపించాము. ఐదేళ్ల ప్రతిపాదనలు రాలేదు. అందుకు పనులు చేయలేకపోయాము. ఈ సమస్యను ప్రస్తుతం అధికారుల దృష్టికి తీసుకెళ్లాము. అన్నమయ్య డ్యాం వెలిగల్లు ప్రాజెక్టు నుంచి సుండుపల్లెతో పాటు మరో ఐదు మండలాలకు తాగునీటిని అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాము. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నాము. అనుమతులు రాగానే సర్వే చేసి పనులు ప్రారంభిస్తాము. 537 పల్లెలకు ఆరు మండలాల్లో తాగునీటిని అందించేందుకు రూ.680 కోట్లతో నీటి పథకం ప్రారంభం కానుంది.



- ప్రసాద్, ఏఈ, ఆర్‌డబ్ల్యుఎస్, సుండుపల్లె

ప్రకృతి సాగు.. ఆదాయం బాగు

- నాలుగు ఎకరాల్లో 40 రకాల పంటలు
- ఐదేళ్లుగా 28 దేశాల శాస్త్రవేత్తలు రాక
- ఆదర్శంగా నిలుస్తున్న మహిళా రైతు

6



ప్రజలు పీఎల్ఎంఎస్‌ను వినియోగించుకోవాలి : ఎస్పీ

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ పోగొట్టుకుంటున్న బాధితులు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పీఎల్ఎంఎస్ (పోలీస్ లాస్ట్ మొబైల్ ట్రేసింగ్ సిస్టం)ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలో సెల్‌ఫోన్ అనేది ప్రజల జీవన విధానంలో ఒక ముఖ్యమైన భాగంగా ఉందని, ప్రతిఒక్కరూ స్మార్ట్‌ఫోన్లలో తమ విలువైన సమాచారాన్ని దాచుకుంటున్నారని తెలిపారు. సెల్‌ఫోన్ పోయినా, చోరీ అయినా సదరు వ్యక్తులు తమ విలువైన సమాచారాన్ని కోల్పోయి ఇబ్బంది పడుతుండడంతో, ప్రజల సమస్యను గుర్తించి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఈ వ్యవస్థ ప్రారంభించామని తెలియజేశారు. జిల్లాలోని ప్రజలు ఎవరైనా తమ మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నట్లయితే జిల్లా పోలీసులు రూపొందించిన 86888 30012 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా హాయ్ అని మెసేజ్ చేయాలని సూచించారు. మెసేజ్ చేసిన వెంటనే ఒక లింక్ వస్తుందని, ఆ లింకుపై టచ్ చేసి అందులో వివరాలన్నీ నమోదు చేసి సబ్మిట్ చేయాలని తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే సైబర్ క్రైం టీం సభ్యులు ఫిర్యాదుదారుడితో వివరాలు సేకరించి సెల్‌ఫోన్‌ను వెతికి అప్పగిస్తారని పేర్కొన్నారు. ప్రజల అవసరార్థం రూపొందించిన ఈ అవకాశాన్ని దుర్వినియోగం చేయవద్దని, తప్పుడు ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో జిల్లాకు ఐదో ర్యాంకు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జిల్లాకు ఐదో ర్యాంకు వచ్చింది. 14 అంశాలను పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం ఈ ర్యాంకులను ప్రకటించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధన కోసం ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. లక్ష్యాలు పెట్టుకోవడమే కాదని, వాటిని ఖచ్చితంగా చేరుకునేలా ప్రణాళికలు అమలు చేయాలని ఆయన పేర్కొన్నారు రాష్ట్రంలో పరిశుభ్రత పెంచేందుకు ప్రతి నెల 3వ శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తోంది ప్రతి నెల ఒక థీమ్ తీసుకుని.. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జనవరిలో న్యూఇయర్ క్లీన్ స్టార్ట్ అనే అంశాన్ని థీమ్‌గా తీసుకోగా.. ఈ నెలలో 'సోర్స్ రీసోర్స్' అనే అంశాన్ని థీమ్‌గా తీసుకున్నారు. మన మూలాలు-మన బలాలు తెలుసుకునేలా రాష్ట్రంలోని వనరులను ఎలా సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలి అనే దానిపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. జీవన ప్రమాణాలు పెంచడం, పర్యాటక రంగానికి ప్రోత్సాహం, పెట్టుబడులు ఆకట్టుకోవడం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడం.. నెట్ జీరోకు రాష్ట్రంలో పర్యావరణాన్ని తీసుకురావడం లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు.

స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా పట్టణాభివృద్ధిశాఖ, పంచాయతీరాజ్ శాఖ చేపట్టిన కార్యక్రమాలపై అధికారులు ప్రోగ్రె స్‌ను సీఎంకు వివరించారు. మొత్తం 14 ఇండికేటర్స్‌లో పెట్టుకున్న లక్ష్యాలను సీఎం ముందుంచారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, పబ్లిక్ టాయిలెట్స్, డోర్‌టు డోర్ కలెక్షన్, సాలిడ్ వేస్ట్ సెగ్రిగేషన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, కమ్యూనిటీ సోక్‌పిట్స్, క్లీన్‌వి లేజ్, ఓడీఎఫ్ ప్లస్ మోడల్ విలేజ్ వంటి అంశాల్లో ఆయా జిల్లాల్లో ప్రగతిపై సీఎంకు వివరించారు. ఈ 14 ఇండికేటర్స్ ఆధారంగా జిల్లాకు ర్యాంకులు ఇచ్చారు. పట్టణాభివృద్ధి శాఖ పరిధిలో డోర్ టు డోర్ కలెక్షన్‌కు 15 పాయింట్లు, సోర్స్ సెగ్రిగేషన్‌కు 35 పాయింట్లు, సాలిడ్‌వేస్ట్ మేనేజ్ మెంట్‌కు 20 పాయింట్లు, లెగసీ వేస్ట్ క్లియరెన్స్‌కు 10 పాయింట్లు, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంటుకు 20 పాయింట్లు ఇచ్చారు. అలాగే పంచాయతీరాజ్‌శాఖలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి 15 పాయింట్లు, పబ్లిక్ టాయిలెట్స్‌కు 10 పాయింట్లు, కమ్యూనిటీ సోక్‌పిట్స్‌కు 10 పాయింట్లు, 100 శాతం డోర్ టు డోర్ చెత్త కలెక్షన్‌కు 10 పాయింట్లు, ఓడీఎఫ్ ప్లస్ మోడల్‌కు 20 పాయింట్ల చొప్పున ఇచ్చారు. ఇలా మొత్తం 200 పాయింట్ల ఆధారంగా జిల్లాల పురోగతిపై ర్యాంకులు ఇచ్చారు.

జిల్లాల వారీగా ర్యాంకులు...

129 పాయింట్లతో ఎన్టీఆర్ జిల్లా మొదటి స్థానంలో ఉండగా, 127 పాయింట్లతో విశాఖ రెండవ స్థానం, 125తో తూర్పుగోదావరి 3వ స్థానం, 122తో అనంతపురం 4వ స్థానం, 120 పాయింట్లతో అన్నమయ్య 5వ స్థానంలో నిలిచింది. చివరి స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లా 81 పాయింట్లతో నిలిచింది.



అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

60 రోజులైనా.. అర్జీలు ఎందుకు పరిష్కరించలేదు

- వీఆర్‌వోలపై జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ ఆగ్రహం

సంబేపల్లె, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులు జరిగి 60 రోజులు పూర్తయింది. అర్జీలను ఎందుకు పరిష్కరించలేదు ? గ్రామాలకు వెళ్లి బాధితులను ఎందుకు కలవలేదు ? ఏం చేస్తున్నారంటూ జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ వీఆర్‌వోలపై మండిపడ్డారు. శుక్రవారం సంబేపల్లె తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబరు 6 నుంచి జనవరి 8 వరకు సదస్సులు ఏర్పాటు చేశారన్నారు. మండల వ్యాప్తంగా పలు సమస్యలపై 1013 అర్జీలు వచ్చాయని, 323 అర్జీలు పరిష్కరించారన్నారు. 690 అర్జీలను ఎందుకు పరిష్కారం చేయ లేదని వీఆర్‌వోలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లోకి వెళ్లి క్షేత్రస్థాయిలో అర్జీదారులను కలిసి ఒక అర్జీ అయినా పరిష్కరించాలని మండి పడ్డారు. ఆఫీసులో కూర్చుని ఉంటే సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ప్రతి ఒక్క వీఆర్‌వో, వీఆర్‌ఏలు గ్రామాల్లోకి వెళ్లాలన్నారు. వారంలో పు రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కారం చూపకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. పీఎస్ కాలనీ గ్రామానికి చెందిన శివయ్య అనే రైతు జెడ్‌హెచ్‌డీసీ భూములకు సంబంధించి అసైన్‌మెంట్ కమిటీ పూర్తయ్యిందని, పట్టాలు ఇవ్వలేదని జేసీ దృష్టికి తీసుకెళ్లారు. నారాయణరెడ్డి గ్రామం కొండావాండ్లపల్లెకు చెందిన గంగారపు కృష్ణమ్మ.. సర్వేనెంబర్ 387/3లో 3.16 ఎకరాల భూమికి సంబంధించి ఆన్‌లైన్‌లో ఉందని పాస్ పుస్తకాలు ఉన్నాయని, మామిడి చెట్లు వేసుకుని ఉన్నామని, తమ దాయాదులు అడ్డుపడుతున్నారని తమ భూ సమస్యను పరిష్కరించాలని జేసీకి అర్జీ అందజేశారు. అనంతరం ఎస్.సోమవరం గ్రామంలో జరుగుతున్న రీసర్వే భూములను పరిశీలించారు. రీసర్వేకి సంబంధించి ప్రతి రైతును పొలం వద్దకు పిలిపించి గట్టు చూపించి పకడ్బందీగా రీసర్వే జరిగేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ స్రవంతి, ఆర్ఐ రవి, మండల సర్వేయర్ హరికృష్ణ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంజీవయ్య జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

- డీఆర్‌వో మధుసూదన్‌రావు

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే మొదటి దళిత ముఖ్యమంత్రిగా ఎదిగిన నాయకుడు దామోదరం సంజీవయ్య అని, ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని సేవా దృక్పథాన్ని పెంచుకోవాలని డీఆర్‌వో మధుసూదన్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌వో మధుసూదన్‌రావు మాట్లాడుతూ సంజీవయ్య దళిత కుటుంబంలో పేదరికంలో పుట్టాడని, కేంద్ర ప్రభుత్వంలో మంత్రిగా పదవులను అధిరోహించి తన జీవితాన్ని సమాజం కోసం త్యాగం చేశారన్నారు. తాను కర్నూలు జిల్లాలో పనిచేసేటప్పుడు న్యాయవాదిగా పనిచేస్తున్న సంజీవయ్య సమీప బంధువుతో మాట్లాడేవాడినని, ఆయన గురించి ఎన్నో విషయాలు తెలుసుకుని స్ఫూర్తి పొందానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీవీఎంసీ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, రామకృష్ణ, వెంకట్రమణ, మనోహర్, రాజశేఖర్, బోదేశావలి, సాంఘిక సంక్షేమశాఖ సిబ్బంది, సాంఘీక సంక్షేమ పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌వో మధుసూదన్‌రావు

యువతిపై యాసిడ్ దాడి

ప్రేమికుల దినోత్సవం రోజున ఓ ప్రేమోన్మాది యువతిపై రాక్షసంగా ప్రవర్తించాడు. సమాజం తలదించుకొనేలా నోటిలో, ముఖంపై యాసిడ్ పోయడంతో పాటు కత్తితో శరీరంపై పలుచోట్ల పొడిచాడు. ఏడాదిగా యువతి వెంటపడుతూ ప్రేమించాలని పలు విధాలుగా ఇబ్బందిపెట్టాడు. ఈ క్రమంలో తల్లిదండ్రులు ఆ యువతికి తన బంధువుతో వివాహం జరిపించేందుకు ముహూర్తం ఖరారు చేశారు. ఈ విషయం తెలుసుకున్న ప్రేమోన్మాది యువతి తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో స్వగ్రామానికి వచ్చి తనను ప్రేమించాలని వేధించాడు. యువతి నిరాకరించడంతో వెంట తెచ్చుకొన్న యాసిడ్‌ను ఆమెపై పోయడమే కాకుండా కత్తితో పొడిచి పారిపోయాడు. ప్రస్తుతం ఆ యువతి పరిస్థితి విషమంగా ఉంది. ఈ అమానుష ఘటన గుర్రంకొండ మండలం ప్యారంపల్లెలో శుక్రవారం చోటుచేసుకొంది.

- ప్రేమికుల రోజున యువకుడి అఘాయిత్యం
- ప్రేమించలేదని.. మెడ, చేతిపై కత్తిపోట్లు
- ప్రాణాపాయ స్థితిలో యువతి
- ఉలిక్కిపడ్డ ప్యారంపల్లె
- బాధిత కుటుంబానికి నారా లోకేశ్ భరోసా



యాసిడ్ దాడిలో గాయపడిన గౌతమి (ఫైల్‌ఫొటో)



మదనపల్లె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గౌతమి

గుర్రంకొండ, ఫిబ్రవరి 14: గుర్రంకొండ మండలం నడిమిఖండ్రిగ పంచాయతీ ప్యారంపల్లెకు చెందిన టి.జనార్ధన్, రెడ్డెమ్మ దంపతులు వ్యవసాయం చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు సం తానం. వీరిలో మొదటి సంతానం టి.రాజేష్ కాగా రెండవ సంతానం గౌతమి(22). గౌతమి విద్యాభ్యా సం చాలా వరకు మదనపల్లెలో జరిగింది. తను డిగ్రీ పూర్తి చేసి బ్యూటీషియన్ కోర్సును అభ్యసిం చింది. మదనపల్లె పట్టణంలోనే ఉంటూ బ్యూటీషియన్ పనులు చేస్తుండేది. ఈ క్రమంలో యువతిని ఏడాదిగా మదనపల్లె పట్టణం అమ్మచెరువుమిట్ట వైఎస్సార్ కాలనీకి చెందిన ఎస్.గణేష్(24) ప్రేమించాలంటూ వేధిస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి గౌతమి అంగీకరించలేదు. అతడు వెంటపడుతుండటంతో ఎవరికీ చెప్పలేక నరకయాతన అనుభవించింది. ఈ నేపథ్యంలో మూడు నెలల క్రితం స్వగ్రామానికి వచ్చేసింది. తల్లిదండ్రులు గౌతమికి తన మేనత్త కుమారుడు శ్రీకాంత్‌తో ఈనెల 7న నిశ్చితార్థం చేశారు. ఏప్రిల్ 29న వివాహం చేసేందుకు ముహూర్తం ఖరారు చేశారు. ఈ విషయం తెలుసుకున్న ప్రేమోన్మాది శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో ప్యారంపల్లెకు ద్విచక్ర వాహనంలో చేరుకున్నాడు. ద్విచక్ర వాహనాన్ని దూరంగా ఉంచి యువతి ఇంటి వద్ద తల్లిదండ్రులు లేని సమయం చూసి ఇంట్లోకి ప్రవేశించి డోర్ లాక్ చేశాడు. యువతి ప్రేమోన్మాదిని ప్రతిఘటించడంతో తన వెంట తెచ్చుకున్న బాటిల్‌లోని యాసిడ్‌ను ఆమె ముఖం, నోట్లో పోశాడు. కత్తితో మెడ, చేతిపై కోసి శరీరంపై అక్కడక్కడ పొడిచాడు. అనంతరం యువతి అరుపులు బయటకు వినపడకుండా డోర్ లాక్‌చేసి పారిపోయాడు. యువతి సెల్‌ఫోన్‌ను కూడా తీసుకెళ్లాడు. దీంతో బాధిత యువతి ఇంట్లో ఉన్న తన తల్లి సెల్‌ఫోన్ నుంచి తండ్రి జనార్ధన్‌కు ఫోన్ చేసి విషయం తెలిపింది. వెంటనే తల్లిదం డ్రులు పొలం వద్ద నుంచి బంధువులు, కుటుంబ సభ్యులకు చెప్పి పరుగున ఇంటికి వచ్చారు. అప్పటికే ఆ యువతి అపస్మారక స్థితిలో ఉండడంతో కారులో గుర్రంకొండ ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తీసుకెళ్లారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేస్తాం

- మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ప్రకటన

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రేమోన్మాది చేతిలో యాసిడ్ దాడిలో గాయపడిన గౌతమిని మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, స్థానిక ఎమ్మెల్యే షాజహాన్ బాషా, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాంచినబాబు పరామర్శించారు. స్థానిక జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని శుక్రవారం మంత్రితో పాటు తంబళ్లపల్లె టీడీపీ నేతలు డి.జయచంద్రారెడ్డి కోపూరి మల్లికార్జుననాయుడులు పరామర్శించి, దాడికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దాడి చేసిన నిందితున్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, నిందితున్ని చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామన్నారు. ప్రభుత్వం తరపున గౌతమికి మెరుగైన చికిత్స అందిస్తామని ప్రకటించారు. అంతకు ముందు మంత్రి నారా లోకేష్, మండిపల్లెతో ఫోన్‌లో మాట్లా డుతూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి హామీ ఇచ్చారు. కాగా నిందితుడిపై కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు గుర్రంకొండ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.



యువతి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

బాలింతపై భర్త దాడి

అదనపు కట్నం కోసం వేధింపులని ఫిర్యాదు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఒక బిడ్డకు తల్లి అయినా ఇంకా అద న పు కట్నం కావాలని మునగపాటి సాహితిపై ఆమె భర్త నాగమళ్ల హరీష్ దాడి చేశాడు. దాడి సమయంలో బయటి నుంచి ఎవరూ రాకుండా అత్త నాగమల్ల శార ద అడ్డుగా నిలిచింది. సాహితి వన్‌టౌన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివ రాల్లోకెళితే.... గతేడాది నాగమళ్ల హరీష్‌కు మార్చి 22న సాహితితో వివాహమైంది. వివాహం సందర్భంగా ఏడు లక్షల రూపాయలు నగదు, 14 తులాల బంగారం ఇచ్చారన్నారు. వివాహమైనప్పటి నుంచీ కొద్ది రోజులు అన్యోన్యంగా వున్నట్లు తెలి పారు. తల్లి మాటలు విని తన భర్త తనను తరుచూ కొడుతున్నట్లు, అదనపు కట్నం తెమ్మని వేధిస్తూ వుండే వాడన్నారు. ఫిబ్రవరి 8న తను ఆడబిడ్డను ప్రసవిం చినట్లు తెలిపింది. గురువారం పుట్టింట్లో ఉండగా తన భర్త హరీష్ ఇంటి తలుపు లు తన్నుకుంటూ వచ్చి అకారణంగా తనను దుర్భాషలాడుతూ బాలింత అని కూ డా చూడకుండా దాడిచేశాడని వివరించింది. అక్కడే వున్న తన పిన్ని కొడుకు వంశీక్రిష్ణను చెవిమీద, పిన్నిని కాలితో కొట్టినట్లు తెలిపింది. తన తల్లి వెంకట రంగ మ్మపై కూడా దాడి చేసి గాయపరిచినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఇంట్లో వు న్న టీవీని పగుల కొట్టినట్లు తెలిపింది. ఇంట్లో ఈ సంఘటన జరుగుతుంటే ఇరుగు పొరుగు రాకుండా అత్త నాగమల్ల శారద బయటే ఉండి వచ్చేవారిని వారించింది సాహితి చెల్లెలు మునగపాటి సుజన ఈ దాడిపై భయపడి బయటికి వెళ్లి పెద్దమ నుషులు డాక్టర్ రంగయ్య, సాంబశివారెడ్డిని పిలిచుకుని వచ్చింది. వారు వచ్చి నాభర్త హరీష్‌ను మందలించి పంపించేరు. గాయపడిన వారికి ప్రభుత్వ ఆస్పత్రి లో చికిత్స చేయించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అర్జీలను త్వరగా పరిష్కరించండి : జేసీ



రీసర్వేను పరిశీలిస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

కలకడ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులో ప్రజలు అందజేసిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన కలకడ మండలం గుడిబండ పంచాయతీ చొక్కన్న వారిపల్లెలో జరుగుతున్న రీసర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రీసర్వే గురించి పట్టాదారులకు ముందస్తు సమాచారంపై తహసీల్దార్‌ను ఆరాతీశారు. భవిష్యత్‌లో రైతులకు ఎలాంటి భూ సమస్యలు తలెత్తకుండా హద్దులు నిర్ణయించాలని సూచిం చారు. పీజీఆర్ఎస్ పోర్టల్ ద్వారా అందిన అర్జీల పురోగతిపై సమీక్షించారు. అనంత రం పట్టాదారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీ ల్దార్ ఫణికుమార్, డీటీ భార్గవి, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

డీపీఓలో ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి



దామోదరం సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పోలీసు అధికారులు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర తొలి దళిత, ముఖ్యమంత్రి దివంగత దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేర కు ఏఓ కృష్ణుడు, దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి రెండో ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య తెలుగు జాతి గర్వించదగ్గ గొప్ప వ్యక్తి అని కొనియాడారు. దామోదరం సంజీవయ్య 1921 ఫిబ్రవరి 14న కర్నూలు జిల్లా కల్లూరు మండలం పెద్దపాడులో మునెయ్య, సుంకులమ్మ దంపతులకు జన్మించారని, 1935లో కర్నూలు మున్సిపాలిటీ ఉన్నత పాఠశాలలో చేరి 1938లో ఎస్ఎస్ఎల్‌సీ జిల్లాలోనే ప్రథము డిగా ఉత్తీర్ణుడయ్యారన్నారు. రాష్ట్ర రెండో ముఖ్యమంత్రి, తొలి దళిత ముఖ్యమంత్రిగా సంజీవయ్య సంయుక్త మద్రాసు రాష్ట్రం సహా రాష్ట్రంలో, కేంద్ర ప్రభుత్వంలో అనేక మంత్రి పదవులను నిర్వహించారన్నారు. 38 ఏళ్ల అతిపిన్న వయస్సులో ముఖ్యమం త్రి అయిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు వీజే రామకృష్ణ, జాన్‌జోసెఫ్, పెద్దయ్య, మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్‌రెడ్డి, ఆర్ఎస్ఐలు, డీపీఓ సిబ్బంది, పోలీసులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



రామాపురం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కారు స్కూటీని ఢీకొనడంతో దగ్గుపాటి పెద్ద రెడ్డెయ్య (67) మృతి చెందగా, మరొ కరు తీవ్రంగా గాయపడ్డారు. శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఘట నపై ఎస్ఐ వెంకటసుధాకర్ రెడ్డి కథనం మేరకు వివరాల్లోకెళితే.... రామాపురం మండలం కమ్మపల్లెకు చెందిన దగ్గుపాటి పెద్దరెడ్డెయ్య శుక్రవారం తెల్లవారు జామున భార్యతో కలిసి స్కూటీపై స్వగ్రామా నికి వస్తూ, బండపల్లె వద్ద రోడ్డు దాటుతుండగా రాయచోటి నుంచి కడప వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ సంఘటనలో దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. రామాపురం పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం రాయచో టి ప్రభుత్వాస్పత్రికి తరలించగా. చికిత్స పొందుతూ పెద్దరెడ్డెయ్య మృతి చెందాడు. భార్యను మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సాంకేతిక కారణాలతో రైలు ఆలస్యం

సిద్దవటం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కనుమలోపల్లె రైల్వే ట్రాక్‌పై శుక్రవారం సాయంత్రం 5 గంటలకు తిరుపతి నుంచి నంద్యాలకు వెళుతున్న డెమో ఎక్స్‌ప్రెస్ ఇంజన్ సాంకేతిక కారణాలతో నిలుపుదల చేశారు కడప నుంచి మరో ఇంజన్‌ను తెప్పించి పంపించామని రైల్వే సిబ్బంది తెలిపారు.

నందలూరులో స్టాపింగ్ ఇవ్వండి

నందలూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నందలూరు రైల్వే స్టేషన్‌లో రైళ్లకు స్టాపిం గ్ ఇవ్వాలని నందలూరు రైల్వేస్టేషన్ కన్సెలేటివ్ మెంబర్ రాచూరి మురళి శుక్రవా రం సికింద్రాబాద్‌లో సౌత్‌సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ఇంటర్ సిటీ ప్యాసింజర్ ప్రారంభించాలని, వెంకటాద్రి, చెన్నై సూపర్ ఫాస్ట్, ముంబై సీఎస్ఎంటీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లకు నందలూరు రైల్వేస్టేషన్‌లో స్టాపింగ్ ఇవ్వాలని కోరారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

మార్చి1 నుంచి 20 వరకు పరీక్షలు : కలెక్టర్

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియేట్ పబ్లిక్ పరీక్ష లను సజావుగా, పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారుల ను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్లో ఇంటర్ పబ్లిక్ పరీక్షల నిర్వహణ ఏర్పాటల్లపై డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, కమిషనరు మనోజ్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులతో కలిసి నిర్వహించిన పరీక్షల నిర్వహణ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియేట్ బోర్డు నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం జూనియర్, సీనియర్ ఇంటర్ అభ్యర్థులకు మార్చి1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లాలో మొత్తం 64 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. అన్ని ప్రైవేట్ కళాశాలల్లో సీసీ కెమె రాలను తప్పక అమర్చాలన్నారు. గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీ సు, రెవెన్యూ అధికారులకు సూచించారు. ఆర్ఐఓ వెకటసుబ్బయ్య విద్యాశాఖ, పోలీసు, రెవెన్యూ, విద్యుత్, వైద్యతదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు.. ఆదాయం బాగు

- నాలుగు ఎకరాల్లో 40 రకాల పంటలు
- ఐదేళ్లుగా 28 దేశాల శాస్త్రవేత్తలు రాక
- ఆదర్శంగా నిలుస్తున్న మహిళా రైతు



ప్రకృతి వ్యవసాయ పద్దతులలో సాగు చేసిన కూరగాయల పంట

వాల్మీకిపురం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువులతో పెట్టుబడులు పెట్టి నష్టాలను చవిచూసిన ఓ మహిళా రైతు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపి పలువురు రైతులకు ఆదర్శంగా నిలిచారు. మండలంలోని అయ్యావారిపల్లెకు చెందిన స్వాతి, రాజారెడ్డి దంపతులు తొమ్మిదేళ్లగా ప్రకృతి వ్యవసాయంతో మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. గ్రామంలో ఉన్న నాలుగు ఎకరాల వ్యవసాయ పొలాల్లో 40 రకాలకు పైగా పంటలు సాగు చేసి దిగుబడులను రాబడుతున్నారు. రసాయనిక ఎరువులను పూర్తిగా నిషేధించారు. ఎర్ర ఇసుక నేలల్లో వ్యవసాయ విధానం మంచి ఫలితాలనే ఇస్తోంది. తక్కువ పెట్టుబడులతో విభిన్న రకాల పంటలు సాగు చేస్తూ మంచి లాభాలనే గడిస్తున్నారు. సాగు చేసిన పంటలు సమీప ప్రాంత రైతులకు అవగాహన కల్పించి ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపేలా శ్రీకారం చుట్టారు. ఇంటర్మీడియేట్ చదువుకున్న మహిళా రైతు స్వాతి ప్రకృతి వ్యవసాయంతో కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. నాలుగెకరాల్లో సాగు చేసిన పంటలు ఏమాత్రం నష్టాల బాట పట్టకుండా తమదైన శైలిలో పర్యవేక్షిస్తూ సాగు పద్ధతులను వృద్ధి చేసుకుంటున్నారు.

ప్రకృతి వ్యవసాయంలో పండించే పంటలు

ప్రకృతి వ్యవసాయం ద్వారా మిరప, ఉల్లి, అలసంద, బెండ, జామ, కొత్తమీర, మెంతులు, చుక్కాకు, ముల్లంగి, బంతి, మొక్కజొన్న, టమోటా, కాకర, బీర, గోరుచిక్కుడు, వంగ, అల్లనేరేడు, ఆముదం, గోంగూర, ఆవాలు, దోస, కీరదోస, బొప్పాయి ఇలా 40కి పైగా వివిధ రకాల పంటలు ప్రకృతి వ్యవసాయంలో సాగు చేస్తుండడం గమనార్హం.

పంటల కోసం జీవామృతం..

పశువుల పేడ, మూత్రము, బెల్లం, పప్పుదినుసుల పిండి, పుట్టమట్టితో జీవామృతం చేసుకుని తద్వారా ముందుగా దుక్కిలో 400 కిలోల ఘనజీవామృతం వేసి దుక్కి చేసుకోవడం, బీజామృతంతో నారు, విత్తనాల శుద్ధి, ప్రతి 15 రోజులకు ఒకసారి 400 లీటర్ల ద్రవ జీవామృతం పిచికారీ చేయడం, 200 లీటర్ల నీమాస్త్రంను, 20 లీటర్ల దశకర్తి, 200 లీటర్ల పుల్లటి మజ్జిగను పిచికారీ చేసి తయారు చేసుకుంటారు. పంటల్లో పురుగుల నివారణకు 15 పసుపు, 10 బ్లూ ప్లేట్లు, 8 లింగాకర్ష బుట్టలు, 6 పక్షి స్థావరాలను ఏర్పాటు చేసుకుంటారు. అంతర పంటలుగా బంతి, మొక్కజొన్న సాగు చేసి మంచి ఫలితాలు సాధిస్తున్నారు.



ప్రకృతి వ్యవసాయ పంటలు పరిశీలిస్తున్న విదేశీ శాస్త్రవేత్తలు (ఫైల్)

వాల్మీకిపురంలో ప్రత్యేక స్టాల్స్..

ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పంటలను వాల్మీకిపురం మహిళా సమాఖ్య కార్యాలయం ఎదుట ప్రతి సోమవారం స్టాల్స్ ఏర్పాటు చేసి ఆకుకూరలు, కూరగాయలు తదితరం విక్రయిస్తుంటారు. అలాగే వారంలో జరిగే సంతలకు, అంగన్వాడీ కేంద్రాలకు కూరగాయలు అందిస్తుంటారు. ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా పెట్టుబడులు తగ్గి పంటలో దిగుబడి రావడమే కాకుండా భూమి సారవంతంగా వచ్చేందుకు తోడ్పడుతున్నారు. రసాయన వ్యవసాయం చేసి తీవ్రంగా నష్టపోయిన తమకు ప్రకృతి సాగు లాభిస్తోందన్నారు. ఐదేళ్లగా వివిధ దేశాల శాస్త్రవేత్తలు, వివిధ రాష్ట్రాల రైతులు, ఉద్యానవన, వ్యవసాయ అధికారులు అయ్యావారిపల్లె గ్రామ సమీపంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించడం గమనార్హం.



ప్రతి సోమవారం ఏర్పాటు చేసే ప్రకృతి వ్యవసాయ కూరగాయల స్టాల్స్

ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలి



రసాయన వ్యవ సాయం ద్వారా నష్టాలు తప్ప పెట్టుబడులు రాబట్టుకునే పరిస్థితులు కనుమరుగయ్యాయి. సులభతరమైన ప్రకృతి వ్యవసాయం ప్రతి రైతు చేయగలిగితే నష్టాల మాటే ఉండదు. రైతుకు తనకున్న పొలంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేయడం ఎన్నో లాభాలను తెచ్చి పెడుతుందనడంలో సందే హం లేదు. 9 ఏళ్ల కాలంగా ప్రకృతి వ్యవసా యం చేస్తున్నా ఏనాడు నష్టాల బాధలు పడలేదు.

- స్వాతి, మహిళా రైతు, అయ్యావారిపల్లె

మహిళా రైతుకు చంద్రబాబు అభినందన

ప్రకృతి వ్యవసాయంలో రాణిస్తున్న మహిళా రైతు స్వాతి 2018లో సీఎం చంద్రబాబు ద్వారా సన్మానం, అభినందనలు అందుకున్నారు. ప్రకృతి వ్యవసాయంలో 3 నెలల డిప్లమో కోర్సు పూర్తి చేసిన స్వాతికి కిసాన్‌మేళా, పాలేకర్ శిక్షణ ద్వారా ప్రశంసాపత్రాలు, మహిళా రైతు, ఉత్తమ మహిళా రైతు అవార్డులు సొంతం చేసుకున్నారు.

అభివృద్ధే పూర్వవిద్యార్థి తపన





పాఠశాల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న శకుంతలమ్మ - పాఠశాల నూతన భవనం

పెద్దతిప్పసముద్రం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): శిథిలావస్థకు చేరుకున్న పాఠశాలను అభివృద్ధి చేయాలనే తపనతో ఉన్నత శిఖరాలకు చేరుకున్న పూర్వవిద్యార్థులు, గ్రామస్తుల సహకారంతో ప్రాథ మిక పాఠశాల నూతన భవ నానికి నోచుకుంది. వివరాల్లోకెళితే...


కర్ణాటక సరిహద్దుగా ఉన్న టి.సదుం పంచాయతీ రామాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠ శాల ఉంది. పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడం తో అభివృద్ధిపై గ్రామస్థులు గానీ, ప్రభుత్వ అధికా రులు గానీ పట్టించుకోలేదు. 30 ఏళ్ల కిందట రా మాపురం వాసి శకుంతలమ్మ చదువుకున్నారు. ప్రస్తుతం ఆమె మంచి ఉన్నత స్థానంలో ఉన్నారు. ఇటీవల తమ స్వగ్రామం రామాపురానికి వచ్చిన ఆమె తాను చదివిన పాఠశాల భవనం చూసి మనసు ద్రవించి పోయింది. వెంటనే శకుంతలమ్మ పాఠశాలకు వెళ్లి అక్కడ శిథిలావస్థలో ఉన్న పాఠ శాల భవనాన్ని చూసి నూతన భవనం నిర్మించా లని అనుకున్నారు. తమ గ్రామస్థులైన తనతో పాటు చదువుకున్న విద్యార్థులను కొందరిని పోగు చేసి పాఠశాల భవనం గురించి వారికి వివరించా రు. తనతోపాటు తన స్నేహితుల సహకారంతో సుమారు రూ.5లక్షలు వెచ్చించి విద్యార్థులకు చక్క టి పాఠశాల భవనాన్ని నిర్మించారు. అందరి సహకారంతో నిర్మించిన పాఠశాలను శుక్రవారం ఎంఈఓ నారాయణ ప్రారంభించారు. పాఠశాల భవనాన్ని అన్ని వసతులతో నిర్మించిన దాత శకుం తలమ్మ సహా పలువురు విద్యార్థులు, గ్రామస్థులను అభినందించారు. దాతల సహాయ సహకారాలతో నిర్మించిన పాఠశాలలో నేటి విద్యా ర్థులు చదువుకుని ఉన్నత శిఖరాలకు వెళ్లి అంద రికీ ఆదర్శప్రాయంగా నిలవాలని ఎంఈఓ సహా పలువురు వక్తలు సూచించారు. కార్యక్రమంలో ములకల చెరువు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి, స్థానిక పాఠశాల ఉపాధ్యాయురాలు తేజశ్రీ, అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు, అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

తిరుపతి నుంచి గల్ఫ్‌కు విమానాలు నడపండి

రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి

రాజంపేట, ఫబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గల్ఫ్ దేశాలకు తిరుపతి అంతర్జాతీయ విమానాశ్ర యం నుంచి అనుమతి కల్పించాలని రాజ్యస భ సభ్యుడు మేడా రఘునాథ రెడ్డి న్యూ ఢిల్లీ లో తిరుపతి ఎంపీ గురుమూర్తితో కలసి కువై ట్ రాయబారి మేషల్ ముస్తాఫ ఆల్ షేమలి కి వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడు తూ ఉమ్మడి కడప, అన్నమయ్య, చిత్తూరు, నెల్లూరు జిల్లాలోని ప్రజలు జీవనోపాధి కోసం గల్ఫ్ దేశాలైన కువైట్, కత్తర్, దుబాయ్, సౌదీ దేశాలకు వెళ్లాలంటే పక్క రాష్ట్రం చెన్నై వెళ్లా లన్నారు. ఈ సమస్యకు పరిష్కారం తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం ఒకటే మార్గం. తిరుపతి అంతర్జాతీయ ప్రమాణాలతో నూత న టెర్మినల్ ఏర్పాటు చేసినా ఇంకా పూర్తి స్థాయిలో విమానాల రాకపోకలు ప్రారంభిం చలేదన్నారు. తిరుపతి అంతర్జాతీ య విమానాశ్రయంలో గల్ఫ్ దేశాలకు రాకపోకలు ప్రారంభించాలని కోరారు.

'సహజ సౌందర్యానికి' ఆంక్షల బ్రేక్



- బోసిపోతున్న... హార్సిలీహిల్స్
- యువతను హడలెత్తిస్తున్న తనిఖీలు
- బాగా దెబ్బతిన్న టూరిజం.. ప్రైవేట్ బిజినెస్
- టోల్‌గేట్‌ను వదిలేసిన కాంట్రాక్టర్

బి.కొత్తకోట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి)

కదలాడే మేఘాల సౌందర్యం.. కను విందుచేసే ప్రకృతి సోయగం.. పరవ శింప జేసే గంధపు గాలుల పరిమళం.. మండు వేసవిలో సైతం మైమరిపించే శీతల వాతావ రణం హార్సిలీహిల్స్ సొంతం. ఆంధ్రా ఊటీగా పేరుగాంచి, సముద్రమట్టానికి 4212 అడుగుల ఎత్తులో వుండి... జాతీయ స్థాయి గుర్తింపు పొందిన అన్నమయ్య జిల్లా, బి.కొత్తకోట మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్ నేడు పర్యాటకులు లేక బోసిపోతోంది. పర్యాటకుల ఆక ర్షణ, అభివృద్ధి కోసం తగిన చర్యలు తీసుకోవాల్సిన టౌన్‌షిప్ కమిటీ ప్రేక్షకపాత్ర పోషిస్తుండడం, పర్యాటక శాఖ నిధులు కేటా యించక పోవడం ఒక కారణమైతే, తాజాగా అధికారులు తీసుకునే చర్యలు పర్యాటకులను దూరం చేస్తున్నట్లు ప్రచారం. ఫలితంగా ఉపాధి కోల్పోయి వందల మంది రోడ్డున పడ్డారు.



హార్సిలీహిల్స్ దిగువ భాగంలో పోలీస్ చెక్‌పోస్ట్

అవుట్‌పోస్ట్‌తో యువత హడల్

మదనపల్లె, అంగళ్లు వద్దనున్న ఇంజనీరింగ్, డిగ్రీ కాలేజీ విద్యార్థులు, వారాంతంలో బెంగళూ రు నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, కదిరి, రాయచో టి, చింతామణి తదితర ప్రాంతాల నుంచి హార్సిలీ హిల్స్‌కు పెద్దసంఖ్యలో యువతీ యువకులు చేరుకుని సందడి చేస్తుంటారు. బ్యాచ్‌లుగా కొంద రు, జంటలుగా కొందరు ద్విచక్రవాహనాల్లో వచ్చి సరదాగా గడుపుతారు. హిల్స్ ఘాట్‌రోడ్డులో కేరిం తలు కొడుతూ, సెల్ఫీలు, వీడియోలు తీసుకుం టూ ఎంజాయ్ చేసి కొందరు తిరుగుముఖం పడితే, మరికొందరు బుక్ చేసుకున్న అతిథిగృహా ల్లో బసచేసి మరుసటిరోజు వెళ్లేవారు. దీంతో ఘాట్‌రోడ్డు మలుపులు, కొండపైనున్న వ్యూ పాయింట్ యువత సందడితో కళకళలాడేవి. కొం తకాలంగా ఈ సరదాలకు ఆంక్షల రూపంలో బ్రేక్ పడింది. బి.కొత్తకోట పోలీసులు కొండ దిగువ భాగంలో అవుట్‌పోస్టును ఏర్పాటు చేసి, పైకి వెళ్లే ప్రతి వాహనాన్నీ ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నా రు. ఇంజనీరింగ్ విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగు లు ఎవరొచ్చినా వారి వారి ఐడీ ప్రూఫ్‌లు అడగ డం, వారి ఇళ్లకు ఫోన్‌లు చేస్తుండడంతో యువత హడలెత్తి హార్సిలీహిల్స్‌కు రావడం మానుకుని ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకుం టున్నట్లు తెలుస్తోంది. యువతీ యువకులను అనుమతించక పోవడంతో కొన్ని కుటుంబాలు మాత్రమే హిల్స్‌ను సందర్శిస్తున్నారు.

బాగా దెబ్బతిన్న బిజినెస్...

పర్యాటకుల రాక తగ్గడంతో ఏపీ టూరిజం అతి థి గృహాలు, బార్ రెస్టారెంట్, అటవీశాఖ ప్రాంగ ణలో బిజినెస్ బాగా తగ్గినట్లు సిబ్బంది చెబుతు న్నారు. కొండపై చిన్నా, చితక వ్యాపారాలతో జీవ నం సాగించే కుటుంబాలు బావురుమంటు న్నా యి. పర్యాటకులను కింది నుంచి పైకి తరలించే ప్రైవేటు వాహనదారులు ఉపాధి కోల్పోయారు. అప్పటి ఆదాయంలో పాతికభాగం కూడా లేదంటున్నారు.

టోల్‌గేటును వదులుకున్న కాంట్రాక్టర్

వాహనాలను కొండమీదకు అనుమతించే టోల్‌గే టుకు టౌన్‌షిప్ కమిటీ ఆధ్వర్యంలో వేలం నిర్వ హిస్తారు. ఈ ఏడాది రూ.46లక్షలకు ఓ వ్యక్తి పాడుకున్నాడు. ఆదాయం వచ్చే కీలక సమయాల్లో ద్విచ క్ర వా హ నాల న ు, ఆటోలను అనుమతించక పోవడం, ప్రస్తుతం యు వత రాకపై ఆంక్షలు విధించడంతో ద్విచక్రవాహనాల సంఖ్య బాగా తగ్గిపోయింది. ఫలితంగా భారీ నష్టాలు తప్పవని భావించిన కాంట్రాక్టర్ టోల్‌గేట్‌ను వదులుకున్నా డు. ప్రస్తుతానికి వచ్చే అరకొర వాహనాలకు రెవెన్యూ సిబ్బందే రుసుము వసూలు చేయాల్సి వస్తోంది. సంబంధిత అధికారులు హార్సిలీ హిల్స్‌లో పర్యాటకుల సంఖ్య సాధారణ స్థితికి వచ్చేలా చూడాల్సి వుంది.



హిల్స్‌పై ఖాళీగా వున్న ఫారెస్ట్ క్యాంపస్



జనం లేక బోసిపోతున్న హార్సిలీహిల్స్ ప్రధాన సర్కిల్

కరెంటు వైర్లే వారి టార్గెట్



- అప్రమత్తంగా లేకుంటే అంతే..
- కొత్తగా నిర్మిస్తున్న ఇళ్లలో చోరీలు
- పోలీసుల నిఘా అంతంత మాత్రమే

కడప క్రైం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఇప్పుడు కడప నగరంలో కొత్తరకం చోరీలు జరుగుతున్నాయి. నూతనంగా నిర్మించిన.. నిర్మిస్తున్న ఇళ్లను టార్గెట్ చేసుకొని దొంగతనాలకు పాల్ప డుతు న్నారు. ఇళ్లలో కొత్తగా వైరింగ్ చేసిన రాగి వైర్లను చోరీ చేస్తున్నారు. ఆ వైరును కాల్చి రాగితీగను అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. వచ్చిన డబ్బుతో జల్సాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి దొంగ తనాలపై బాధితులు పోలీసులను ఆశ్రయించలేకపోతున్నారు.

కడప నగర శివార్లలో ఉన్న వెంచర్లు, జగనన్న కాలనీల్లో నూతనంగా నిర్మిస్తున్న ఇళ్లను టార్గెట్ చేసుకుంటారు. వైరింగ్ కనెక్షన్లు, శానిటైషన్ పనులు జరుగుతున్న ఆ ఇళ్లపై పక్కాగా రెక్కీ నిర్వహించి... రాత్రుళ్లు అక్కడ ఎవరూ లేని సమయంలో వైర్లను పైపుల్లో నుంచి మొత్తం లాగి తీసుకెళుతున్నారు. ఇలాంటి దొంగతనాలు నగరంలో తరచూ జరుగుతున్నాయి. అయితే బాధి తులు కొందరు పోలీసులకు ఫిర్యాదు చేస్తే మరికొందరు విద్యుత్ వైర్లే కదా అని వదిలేస్తున్నారు.

పులివెందుల రోడ్డులోని కొన్ని ఏరియాల్లో నూతనంగా ఇళ్లనిర్మాణాలు చేపట్టారు. ఓ వ్యక్తి కరెం టు కనెక్షన్ లాగేందుకు పైపుల్లో వైర్లను లాగి ఆ ఇంటికి తాళాలు వేసుకుని వెళ్లాడు. అయితే ఇం టి తాళాలు పగలగొట్టకుండానే మెయిన్ పైపుల ద్వారా వైర్లు మొత్తం లాగేసుకుని అపహరించా రు. ఇదే తంతు చుట్టుపక్కల కూడా జరగడంతో చేసేదేమీలేక మరోమారు వైరు కనెక్షన్‌ను ఇచ్చుకున్న పరిస్థితి. అలాగే రామాంజనేయపురంలో టిడ్కో జగనన్నకాలనీలో కూడా తరచూ ఇలాంటి దొంగతనాలే జరుగుతున్నాయి.

మైనర్లతోనే చోరీలు

కొంత మంది మైనరు యువకులు మత్తుకు అలవాటు పడి డబ్బులు కోసం ఇలాంటి చోరీలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. మైనర్లు కావడం తో వారిపై ఎలాంటి కేసులు ఉండవనే ఉద్దేశ్యంతో కొంత మంది వీరిని ఉపయోగించుకుని ఇలాంటి చోరీలకు పాల్పడుతున్నారు. దొంగలించిన వైరులోని కాపర్, సిల్వర్ తీసుకుని గుజిరి వ్యాపారు లకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

కొరవడుతున్న నిఘా

నూతన భవన నిర్మాణాల్లో కరెంటు వైర్ల దొంగతనాలపై పోలీసులు నిఘా అంతంత మాత్రమే ఉంది. అలాగే ఇంటి నిర్మాణ యజమానులు సైతం భవన నిర్మాణ సమయంలో ఇంట్లో విలువైన వస్తువులు ఉన్నప్పటికీ వారు కూడా తాళాలు వేసుకుని వెళుతుండడంతో.. రాత్రి సమయంలో చోరీకి పాల్పడుతున్నారు. అక్కడ వాచ్‌మెన్ కానీ, ఇంటిలో కాపలా ఎవరైనా ఉంటే ఇలాంటి చోరీలు జరగకుండా నివారించవచ్చు.

ఆటో ఢీ... వ్యక్తి మృతి



రంజయ్‌మెహతో మృతదేహం

మైలవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దొడియం గ్రామ సమీపంలో నక్కవానిపల్లె వైపు వెలుతున్న రంజయ్‌మెహతో (43) అనే వ్యక్తిని ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఢీకొనడంతోమృతి చెందినట్లు ఎస్ఐరంతుల్లారెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. బీహార్ రాష్ట్రానికి చెందిన రంజయ్‌మెహతో సోలార్ కంపెనీలో కూలీ పనులు చేసుకుంటూ ఉండేవాడు. గురువారం రాత్రి రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న సమయంలో ట్రాక్టర్ ఢీకొనడంతో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుండెపోటుతో ఈఓఆర్‌డీ మృతి



మూరతోటి సుధాకర్ (ఫైల్‌ఫోటో)

మైదుకూరు రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్ర జ్యోతి): మం డలంలోని వనిపెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఇన్‌చార్జ్ ఈఓఆర్‌డీగా పనిచేస్తున్న మూరతోటి సుధాకర్ శుక్రవారం తెల్లవా రుజామున గుండె పోటుతో మృతి చెందాడు. బంధువుల వివరాల మేరకు.. సుధాకర్ గత ఐదేళ్లుగా మైదుకూరు మండలంలో పనిచేస్తున్నారు. ఆయన సొంత గ్రామమైన బద్వేలులో శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆటో బోల్తా.. 8 మందికి గాయాలు



గాయపడ్డ అనంతపురంవాసులు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మార్కాపురం వద్ద ఆటో బోల్తా పడడంతో 8 మందికి గాయాలయ్యాయి. అనంతపురం జిల్లాకు చెందిన 8 మంది శివభక్తులు మొక్కుబడి తీర్చుకునేందుకు ఆటోలో బయల్దేరి పోరుమామిళ్ల మీదుగా శ్రీశైలం వెలుతుండగా మార్కాపురం సమీపంలో గేదెలు అడ్డం రావడంతో వాటిని తప్పించబోయి బోల్తాపడింది. దీంతో ఆటోలోని 8 మందికి గాయాలయ్యాయి. వెంటనే వారిని 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో లక్ష్మి నారాయణ, లక్ష్మినరసింహులు, సాకే నరసింహులు, పి.జయచంద్ర, లక్ష్మినరసింహులు, యశ్వంత్‌తో పాటు మరొకరు ఉన్నారు.

పురుగులమందు తాగి ఒకరు మృతి
మరొకరికి అస్వస్థత



విష్ణువర్ధన్ (ఫైల్)

చెన్నూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు కు చెందిన విష్ణువర్ధన్ (31), లక్ష్మణ్ (35) అనే యువకులు వేర్వేరు కార ణాలతో శుక్రవారం పురుగులమందు తాగారు. వీరిలో విష్ణువర్ధన్ మృతి చెందగా, లక్ష్మణ్ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. పోలీసుల వివరాల మేరకు.. చెన్నూరు భవానీనగర్‌కు చెందిన జింకా విష్ణువర్ధన్ స్థానికంగా ఓ సెల్‌పాయింట్ పెట్టుకుని జీవించేవాడు. వ్యాపారం సరిగ్గా జరగక రెండు నెలల క్రితం మూసివేశాడు. దీంతో అప్పులపాలు కావడంతో తీవ్ర మనస్తాపానికి గురై శనివారం ముండ్లపల్లె రోడ్డులో పురుగులమం దు తాగాడు. అలాగే అతని స్నేహితుడు లక్ష్మణ్ సైతం మనస్తాపంతో పురుగులమందు తాగాడు. విష్ణువర్ధన్ ఇంటికి రాకపోవడంతో బంధువులు గూగుల్ మ్యాప్ ద్వారా గుర్తించి కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొం దుతూ మృతి చెందాడు. అలాగే లక్ష్మణ్‌ను కడప నగరంలోని ఓ ప్రైవే టు ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు కర్నూలుకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అర్జీల పరిష్కారానికి బాధ్యతాయుతంగా పని చేయాలి

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్



మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీల పరిష్కారానికి బాధ్యతాయుతంగా, జవాబుదారీతనంతో పని చేయాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో కలెక్టర్ అధ్యక్షతన బద్వేలు, కడప రెవెన్యూ డివిజన్ల పరిధిలోని రెవెన్యూ అధికారులకు రెవెన్యూ అంశాలు, వివిధ చట్టాలపై ఒక రోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 80శాతం పైగా రెవెన్యూ సమస్యలపైనే అర్జీలు వస్తున్నాయన్నారు. ఇందుకు సంబంధించి కడప, బద్వేలు రెవెన్యూ డివిజన్ల ఆర్డీవోల పరిధిలోని సర్వేయర్లు, వీఆర్వోలు, డిప్యూటీ తహశీల్దార్లు, తహశీల్దార్లకు రెవెన్యూ అంశాలకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించామన్నారు. ఆయా మండల పరిధిలో తహశీల్దార్లు కూడా కార్యాలయ సిబ్బందితో రెవెన్యూ సమస్యలపై వర్క్ షాపు నిర్వహించుకోవాలన్నారు. మండలాల్లో ఆయా గ్రామాలకు సంబంధించిన అర్జీలను పరిశీలించి ఏ అంశాలపై అర్జీలు వచ్చాయో క్రోడీకరించుకోవాలన్నారు. అలాగే పీజీఆర్ఎస్, రెవెన్యూ సదస్సులు, రీ సర్వేలో వచ్చిన అర్జీలను పరిశీలించి డూప్లికేట్ అర్జీలను తొలగించాలన్నారు. అర్జీలను నిశితంగా పరిశీలించి సమస్యలను తెలుసుకుంటూ అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారాలు చూపాలన్నారు. ముఖ్యంగా రెవెన్యూ అధికారులు వారంలో 4 రోజుల పాటు గ్రామాల్లో విజిట్ చేయాలన్నారు. రెవెన్యూలో అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అధికారులు అసైన్డ్ భూములు, ఆర్ఓఆర్ పట్టాదారు పాస్ పుస్తకాలు, చట్టాలు తదితర అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అతిదిసింగ్ రెవెన్యూ సదస్సులు, రీ సర్వే, గ్రామ సభలు, ఫ్రీహోల్డ్‌భూముల మానిటరింగ్ చేస్తున్నారని.. అందుకనుగుణంగా రెవెన్యూ సిబ్బంది నిబద్దతో పని చేయాలన్నారు. సమా వేశంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఆర్డీవో జాన్‌ఇర్విన్, బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్, తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్వోలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

వైవీయూలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగం ఏర్పాటు



వీసీ ప్రొఫెసర్ కృష్ణారెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వైవీయూ ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి వెల్లడించారు. శుక్రవారం విశాఖపట్టణం హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్‌తో వైవీయూ ఒప్పందం కుదుర్చుకుంది. ఈమేరకు వైవీయూ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి సమక్షంలో కులసచివులు ఆచార్య పుత్తా పద్మ, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథ్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ తుంగ శ్రీకాంత్, నేషనల్ మెంబర్ పి.దయాకర్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ ఈ ఎంఓయూ ద్వారా లభించే శిక్షణతో విద్యార్థులలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు. సమావేశంలో పర్యావరణ శాఖ సహా ఆచార్యులు డాక్టర్ టి. చంద్రశేఖర్, హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ కడప జిల్లా ఆర్గనైజింగ్ కమీషనర్ జి.వెంకట సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడి....
వ్యక్తిపై పోక్సో కేసు

ప్రొద్దుటూరు ,ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన ఓ బాలికకు మాయ మాటలు చెప్పి లైంగికదాడికి పాల్పడిన కుళాయప్ప అలియాస్ హర్ష అనే (23) యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ భావన తెలిపారు. ఈనెల 10 తేదీ నుంచి బాలిక ఇంటి నుంచి తప్పిపోయినట్లు కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈమేరకు గత రెండు రోజులుగా త్రీటౌన్ సీఐ గోవింద రెడ్డి ఆద్వర్యంలో పోలీసులు తీవ్రంగా గాలించి పట్టుకున్నారు. బాలికకు మాయ మాటలు చెప్పి కిడ్నాప్ చేసి మానసికంగా శారీరకంగా హింసించిన కుళాయప్పపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

20 మంది రెవెన్యూ సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు

కడప కలెక్టరేట్ ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాలుగు రెవెన్యూ డివిజన్ల పరిధిలో వివిధ మండలాల్లో పని చేస్తున్న 20మంది రెవెన్యూ సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ సంబంధిత విషయాలు, మ్యుటేషన్ తదితర సమస్యలు పరిష్కరించడంలో ఆర్ఐలు, వీఆర్వోలు, సర్వేయర్లు అవినీతికి పాల్పడుతున్నట్లు ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. ఈ మేరకు 20 మంది సచివాలయ, రెవెన్యూ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. వారిపై క్రమశిక్షణ చర్యలు కూడా తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. బద్వేలు మండలం తిప్పనపల్లి సెక్రటేరియట్ వీఆర్వో సాలమ్మ, చక్రాయపేట మండలం సురభి సెక్రటేరియట్ సర్వేయర్ విజయకుమార్, దువ్వూరు వీఆర్వో కె.మునిస్వామి, దువ్వూరు మండలం ఇడమడక వీఆర్వో హరియాదవ్, జమ్మలమడుగు మండలం బి.బొమ్మపల్లి వీఆర్వో భీమన్న, కడప మండలం మామిళ్లపల్లి వీఆర్వో జహీర్ అబ్బాస్, ఉక్కాయపల్లి వీఆర్వో శ్రీనివాసులు, కలసపాడు మండలం ఎగువ రామాపురం వీఆర్వో కొండయ్య, పిడుగుపల్లి వీఆర్వో ఆనందరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌రావు, కమలాపురం మండలం కోగటం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అర్జున్, లేటపల్లె వీఆర్వో వెంకట రామన్న, మైదుకూరు మండలం ముదిరెడ్డిపల్లి వీఆర్వో మధుడేవిడ్, మైలవరం మండలం తలమంచిపట్నం వీఆర్వో ఓబులేసు, రాజుపాలెం మండలం టంగుటూరు వీఆర్వో సరళ, వల్లూరు మండలం వీఆర్వో ఖాజీమొహిద్దీన్, వేంపల్లి మండలం రామిరెడిపల్లి వీఆర్వో ఓబయ్య, ఒంటిమిట్ట మండలం మంటపంపల్లి వీఆర్వో శ్రీనివాసులు, వేంపల్లి మండలం కథలూరు సర్వేయర్ బ్రహ్మయ్య, వేంపల్లి మండల సర్వేయర్ బ్రహ్మకుమార్‌రెడ్డిలు ఉన్నారు.

కువైత్‌లో వ్యక్తి మృతి

ఓబులవారిపల్లి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మపల్లి చిన్న ఓరంపాడు హరిజనవాడకు చెందిన రవికుమార్ (39) కువైత్‌లో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొంతకాలం క్రితమే ఉపాధి కోసం కువైత్ వెళ్లాడని, అక్కడ సెంట్రింగ్ పనులు చేస్తుండగా లిఫ్ట్‌లోంచి జారి పడడంతో మృతి చెందాడన్నారు. మృతదేహాన్ని శనివారం స్వగ్రామానికి తీసుకురానున్నారని వివరించారు.

ఆలయాల్లో చోరీలకు పాల్పడే ఇద్దరి అరెస్టు

- రూ.12లక్షలు విలువచేసే బంగారు, వెండి వస్తువులు స్వాధీనం



చోరీకి పాల్పడిన నిందితులు, స్వాధీనం చేసుకున్న ఆభరణాలను చూపుతున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆలయాలను టార్గెట్‌గా చేసుకొని మధ్యాహ్న సమయంలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.12లక్షలు విలువచేసే బంగారు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి శుక్రవారం సాయంత్రం జమ్మలమడుగు అర్బన్ పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ వెంకటేశ్వరరావు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జమ్మలమడుగులో ఈనెల 5వ తేదీ నాగులకట్ట ఆలయంలో అమ్మవారి బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేసినట్లు ఆలయ అధ్యక్షుడు జి.తిరుమలదాసు అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా శుక్రవారం తాడిపత్రి రోడ్డులోని సాయిశివానీ కల్యాణ మండపం సమీపాన ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదస్థితిలో మోటారు సైకిల్‌పై వెళుతుండగా వారిని సీఐ లింగప్ప, ఎస్ఐ రామకృష్ణ సిబ్బంది పట్టుకున్నారని తెలిపారు. వీరిని విచారించగా పెద్దముడియం మండలం నెమళ్లదిన్నెకు చెందిన జంబులదిన్నె బాలక్రిష్ణ ప్రస్తుతం ప్రొద్దుటూరు శ్రీనివాసనగర్‌లో నివాసం ఉంటున్నారు. అలాగే చింతకాయల హుస్సేన్ బాషగా గుర్తించారని తెలిపారు. వీరిని పూర్తి స్థాయిలో విచారణ చేయగా గత ఆరు నుంచి 7 నెలలుగా ఆలయాలను టార్గెట్‌గా చేసుకొని చోరీలకు పాల్పడినట్లు తేలిందన్నారు. వారు మొత్తం 26 కేసుల్లో నిందితులుగా ఉన్నారన్నారు. ప్రస్తుతం వీరి వద్ద నుంచి 20 గ్రాముల బంగారు, 9.40 కేజీల వెండి ఆభరణాలు (ఆలయాల అమ్మవారి) స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. మొత్తం వస్తువులు రూ.12 లక్షలు విలువ అవుతాయని తెలిపారు. విచారణలో సుమారు 26 కేసులకు సంబంధించి జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు, కర్నూలు, యాడికి, బనగానపల్లి, ఆళ్లగడ్డ తదితర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్లు తేలిందన్నారు. పట్టుబడిన ఇద్దరి నిందితులను కోర్టుకు హాజరుపరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు.

విశ్వనాథ్ కుటుంబానికి ఆదానీ కంపెనీ రూ.15 లక్షల పరిహారం

- సబ్‌కాంట్రాక్టర్ రూ.8లక్షలు, ఎమ్మెల్యే కుటుంబసభ్యులు రూ.3లక్షలు అందజేత



విశ్వనాథ్ తండ్రి బలరామయ్యకు రూ.15లక్షల చెక్కును అందజేస్తున్న ఆదానీ కంపెనీ ప్రతినిధులు

కొండాపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ట్యాంకర్ కింద పడి మృతి చెందిన మండలంలోని తిరుమలాయపల్లె గ్రామానికి చెందిన విశ్వనాథ్ కుటుంబానికి ఆదానీ కంపెనీ రూ.15లక్షలు చెల్లించింది. కంపెనీ ప్రతినిధులు శుక్రవారం రూ.15లక్షల చెక్కును తండ్రి బలరామయ్యకు అందజేశారు. పరిహారం చెల్లించాలంటూ విశ్వనాథ్ కుటుంబంతో పాటు తిరుమలాయపల్లె గ్రామస్థులు గురువారం ఆదానీ కంపెనీ వద్ద విశ్వనాథ్ మృతదేహంతో ఆందోళనకు దిగారు.

ఈ నేపథ్యంలో ఆదానీ కంపెనీ దిగి వచ్చింది. దీంతో రూ.15లక్షల పరిహారంతో పాటు భవిష్యత్తులో విశ్వనాథ్ అక్కకు ఆదానీ కంపెనీలో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చినట్లు విశ్వనాథ్ బంధువులు తెలిపారు. అదేవిధంగా కంపెనీ సబ్ కంట్రాక్టర్ చెన్నారెడ్డి రూ.8లక్షలు, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కుటుంబ సభ్యులు రూ.3లక్షలు విశ్వనాథ్ తండ్రి బలరామయ్యకు అందజేశారు. తమ కుటుంబానికి న్యాయం జరగడానికి సహకరించిన తిరుమలాపల్లె గ్రామస్తులు, మండల కూటమి ఇన్‌చార్జ్ శివనారాయణరెడ్డికి విశ్వనాథ్ తండ్రి కృతజ్ఞతలు తెలిపారు.

పీజీ విద్యార్థులకు నూతన సిలబస్ రూపకల్పన



బీఓఎస్ చైర్మన్‌లతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రఘునాథ్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యావిధానం- 2020 ప్రకారం లెటరల్ ఎంట్రీ పోస్ట్‌గ్రాడ్యుయేషన్ కోర్సులకు నూతన సిలబస్ రూపకల్పన చేయనున్నట్లు వైవీయూ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి వెల్లడించారు. శుక్రవారం విశ్వవిద్యాలయంలోని తన చాంబర్‌లో వైవీయూ అకాడమిక్ డీన్ ఆచార్య చంద్ర ఓబుళరెడ్డి, అసోసియేట్ డీన్ డాక్టర్ వసుగోవర్ధన్‌రెడ్డి, వివిధ కోర్సుల బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌లతో ప్రిన్సిపల్ సమావేశమయ్యారు. ఈసందర్భంగా కొన్ని కోర్సులకు పాత సిలబస్, కొన్ని కోర్సులకు కొత్త సిలబస్ ఉందని తెలిపారు. అందరి అభిప్రాయాల మేరకు ఏకరూపంలో నూతన సిలబస్ రూపొందించాలని నిర్ణయించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి నూతన సిలబస్ అమలు చేయనున్నామన్నారు. బీఓఎస్ చైర్మన్‌లు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడిన ఇద్దరు విద్యుత్ ఉద్యోగులు సస్పెన్షన్

కడప నాగరాజుపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు సబ్ ఈఆర్ఓ కార్యాలయంలో అవినీతికి పాల్పడిన ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈఆర్వో కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ యం.సుజిత్ విద్యుత్ బిల్లుల ద్వారా వచ్చిన రూ.16,59,944 నగదును బ్యాంకులో సంస్థ అకౌంట్‌కు జమచేయకుండా అవినీతికి పాల్పడ్డారు. గత నాలుగు నెలల నుంచి అతనిపై పర్యవేక్షణ చేయనుందుకు జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ సీహెచ్ విజయబాబును సస్పెండ్ చేశామని తెలిపారు. సంస్థకు నష్టం కలిగించే పనులకు పాల్పడితే ఎంతటి వారైన శాఖపరమైన చర్యలు తప్పవని ఎస్ఈ హెచ్చరించారు.

పేదల ఇళ్లపై కబ్జాదారుల కన్ను!

» ఏళ్లుగా పూర్తికాని పక్కాగృహాలు » పట్టించుకోని పాలకులు » బిస్మిల్లా నగర్ హౌసింగ్ కాలనీ లబ్ధిదారుల ఆందోళన

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పట్టణానికి దూరంగా విసిరేసినట్లుగా ఉన్న ప్రాంతంలో దారీ తెన్నూ లేని వంక పోరంబోకు వద్ద పేద ముస్లిం మహిళలకు స్థలాలు కేటాయించారు. పక్కా గృహాలు కూడా మంజూరు చేశారు. కనీస సౌకర్యాలు సైతం లేకపోవడంతో గృహ నిర్మాణ సామగ్రి తరలించడం కూడా ఖర్చుతో కూడిన వ్యవహారం కావడంతో ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో నిర్మాణం పూర్తి చేయడం సాధ్యం కాక, సొంతంగా నిధులు ఖర్చు చేసేందుకు ఆర్థిక స్థోమత లేక ఇళ్ల నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఏళ్ల తరబడి అలాగే ఉండిపోయిన ఆ నిర్మాణాలపై కబ్జాదారుల కన్ను పడింది. కంచె వేసి ఒక్కొటొక్కటిగా ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

2008-2009లో రైల్వేకోడూరు మండలం మైసూరి వారిపల్లె పంచాయతీలో ఊరికి మూడు కిలో మీటర్ల దూరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద 20 మంది పేద ముస్లిం మహిళలకు ఇంటి స్థలాలు కేటాయించి పక్కా గృహాలతోపాటు, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.50 వేలు మంజూరు చేసింది. దాంతో లబ్ధిదారులు ఇండ్లు నిర్మించుకునేందుకు ప్రయత్నించినా, దారి లేకపోవడంతో సిమెంట్, కంకర వంటి గృహనిర్మాణ సామగ్రి తరలించేందుకు పలు సమస్యలు ఎదుర్కొన్నారు. దీంతో ముస్లిం మహిళలు అష్టకష్టాలు పడి ఇటుకలు, ఇసుక, కంకర, నీరు తదితరాలను సేకరించుకుని పనులు ప్రారంభించారు. అయితే సమస్యలు మళ్లీ, మళ్లీ రావడం, ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు చాలక పోవడంతో పనులు వివిధ స్థాయిల్లో నిలచిపోయాయి.. ఇదే అదనుగా ఆయా ప్లాట్లపై అక్రమార్కుల కన్ను పడింది. ఒక పక్కా గృహాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించుకుని కంచె వేశారు. మరిన్ని ప్లాట్లపై కబ్జాదారుల కన్ను పడక ముందే, ప్రభుత్వం మరిన్ని నిధులు కేటాయించడంతోపాటు, ఆ కాలనీలో మౌలిక సౌకర్యాలు కల్పించి, ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకునేందుకు అవకాశం ఉంటుందని లబ్ధిదారులు చెబుతున్నారు.





నిర్మాణంలో ఉన్న ఇంటిని కబ్జా చేసి కంచె వేసిన దృశ్యం (ఇన్‌సర్ట్) అసంపూర్తిగా ఉన్న ఇంటి చుట్టూ పెరిగిపోయిన ముళ్ల పొదలు

తప్పకుండా సహకరిస్తాం

బిస్మిల్లానగర్ లబ్ధిదారులకు పూర్తి సహకరించాం. మౌలిక వసతులు లేకపోవడం కారణంగా పనులు నిలిచిపోయాయి, ప్రభుత్వం నుంచి ఉత్వర్వులు వస్తే తప్పకుండా సహకారం అందిస్తాం

\- మురళీకృష్ణ, హౌసింగ్ అధికారి

మంత్రితో ఆర్టీసీ ఈడీ భేటీ



మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలిసిన ఆర్టీసీ ఈడీ చంద్రశేఖర్

చిన్నమండెం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని బోరెడిగారిపల్లెలోని ఆయన నివాసంలో ఆర్టీసీ ఈడీ చంద్రశేఖర్ కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆర్టీసీ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అధికా రులకు ఎటువంటి సమస్యలున్నా తమకు తెలియజేసి పరిష్కరించుకోవచ్చునన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నివాళి

ప్రమాదంలో మృతి చెందిన మండల కేంద్రంలోని అరబ్‌వీధికి చెందిన రఫీక్‌ఖాన్‌కు మంత్రి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రఫీక్‌ఖాన్ మృతి బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి రాక

రామాపురం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగుట్టపల్లె బీసీ కాలనీలో ఉన్న గంగమ్మ ఆలయాన్ని శనివారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సందర్శించనున్నట్లు ఆ గ్రామ టీడీపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆ గ్రామ నాయకులు కోరారు.

రాజంపేటకు నీటి సరఫరా బంద్

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య నీటి సరఫరా స్కీమ్ మరమ్మతుల కారణంగా శని, ఆదివారం రెండు రోజులపాటు రాజంపేట పట్టణానికి తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మన్నూరు తోట కల్యాణమండపం సమీపంలో 400 ఎం.ఎం. పైప్‌లైన్ లీకేజ్ ఏర్పడిందని, దీని మరమ్మతుల కారణంగా 32 ప్రాంతాలలో నీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు. ప్రజలు గమనించి ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు

సిద్దవటం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగంపల్లె, కడపాయపల్లె గ్రామాలకు చెందిన కోదండరామాలయంలో శనివారం ఉదయం నూతన సీతారామ లక్ష్మణుల మూలవిరాట్ విగ్రహాల ప్రతిష్ఠకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేసి గ్రామాల్లో మూల విరాట్‌లకు గ్రామోత్సవం చేశారు. ఈ సందర్భంగా వివిధ దేవతామూర్తుల వేషధారణలతో భక్తులు నిర్వహించిన కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వాటర్ షెడ్ పనులు సద్వినియోగం చేసుకోవాలి

● డ్వామా పీడీ వెంకటరత్నం

సుండుపల్లె, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాల అభివృద్ధి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వాటర్‌షెడ్ పనులను సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ వెంకటరత్నం సూచించారు. వాటర్‌షెడ్ యాత్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రైతులకు, విద్యార్థులకు, ప్రజలకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పొలిమేర పల్లె, చిన్నగొల్లపల్లె, సుండుపల్లె గ్రామ పంచాయతీల్లో వాటర్ షెడ్ పనులు జరుగుతున్నాయని తెలియజేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థులకు నీటి ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను జ్యేష్ఠ, గగన, మస్తానీ గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ నరసయ్య, ప్రాజెక్టు ఆఫీసర్ అశోక్‌రెడ్డి, ఏపీవో మాలిక్‌బాషా, టీడీపీ నాయకులు శివరామిరెడ్డి, మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరాంనాయుడు, వాటర్‌షెడ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గాలివీడు: నీటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని వాటర్ షెడ్ ప్రాజెక్టు ఆఫీసర్ వెంకట్రామిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని గుండ్లచెరువు గ్రామంలో శుక్రవారం వాటర్ షెడ్ అవగాహన యాత్ర ప్రారంభించారు ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, సిబ్బందితో పాటు పూలు కుంట సర్పంచ్ పార్థసారథిరెడ్డి, మాజీ సర్పంచులు విజయ భాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు వీర రాఘవులు, ఉదయ్‌కుమార్, మిట్టపల్లి వెంకట్రామి రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, పోలీసు రెడ్డెప్పరెడ్డి, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు యోగాంజులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటరత్నం

న్యాయవ్యవస్థ ప్రజాస్వామ్యానికి మూలస్తంభం

● ఐదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యానికి న్యాయ వ్యవస్థ మూల స్తంభం లాంటిదని రాయచోటి ఐదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి అన్నారు. రాయచోటి కోర్టులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జేసీ ఆసిఫాసుల్తానా, లక్కిరెడ్డిపల్లె సివిల్ జడ్జి ఎస్‌కే ఫైజున్నీసా బదిలీ సందర్భంగా శుక్రవారం రాత్రి రాయచోటి ఐదవ అదనపు జిల్లా జడ్జి కోర్టు ప్రాంగణంలో రాయచోటి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్. ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, న్యాయ గుమస్తాలు, జడ్జీలు జేసీ ఆసీఫా సుల్తానా, ఎస్‌కే ఫైజున్నీసాలను ఘనంగా సన్మానించారు.

మెగా లోక్అదాలత్‌ను విజయవంతం చేయాలి

నందలూరు : నందలూరు కోర్టు నందు మార్చినెల 8న జరగనున్న జాతీయ లోక్అదాలత్ విజయవంతం చేయాలని సీనియర్ సివిల్‌జడ్జి కె.భార్గవి పిలుపునిచ్చారు. శుక్రవారం నందలూరు కోర్టులో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. రాజంపేట రూరల్ సీఐ రమణ, పుల్లంపేట, నందలూరు ఎస్ఐలు జె.మోహన్ కుమార్ గౌడ్, వెంకటేశ్వర్లు, పెనగలూరు ఏఎస్ఐలు మల్లికార్జున, కోర్టు సూపరింటెండెంట్ రమేష్‌కుమార్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



బదిలీపై వెళుతున్న జడ్జిలను సన్మానిస్తున్న మహిళా న్యాయవాదులు

విద్యార్థులకు కంటి పరీక్షలు

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్కావారిపల్లె జడ్పీ హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన స్కూల్ చైల్డ్ స్క్రీనింగ్ ప్రోగ్రాంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పాల్గొన్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముక్కా వరలక్ష్మి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారులు, ఉపాధ్యా యులు, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్

పుల్లంపేట : మండల పరిధిలోని టి.కమ్మపల్లెకు చెందిన నేలపాటి దీక్షితకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన 80 వేల రూపాయల చెక్కును ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ శుక్రవారం పంపిణీ చేశారు. మండల టీడీపీఉపాధ్యక్షులు చంద్రశేఖర్‌నాయుడు, కావుటూరి శ్రీరాములునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట అభివృద్ధే లక్ష్యం: చమర్తి

రాజంపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాజంపేట అభివృద్ధి తమ లక్ష్యమని రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. శుక్ర వారం వరదయ్యగారిపల్లె మదన గోపాలపురం గ్రామపంచాయతీలో సిమెంట్ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు, మండల టీడీపీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్య నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చమర్తి సురేష్ రాజు, పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు, వీరబల్లి మండల అధ్యక్షులు భానుగోపాల్ రాజు తదితరులు పాల్గొన్నారు.



సిమెంట్ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న జగన్‌మోహన్ రాజు

దుప్పట్ల పంపిణీ

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండల బీజేపీ అధ్యక్షుడు ముక్కా రూపేష్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం ఆయన అభిమానులు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన అతిథిగృహంలో భారీకేక్‌ను కత్తిరించి అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం పేద మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఓబీ రవీంద్రారెడ్డి, కేశవరాజు, నరసారెడ్డి, ముక్కా జనార్దన్‌రెడ్డి, యానాది రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, సిద్దారెడ్డి, నరసింహులు, సురేష్, శివ, రెడ్డిబాషా, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు

బాల్య వివాహాలు నేరం

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బాలిరెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలపై చైల్డ్ ప్రొటక్షన్ అధికారిని రామలక్ష్మీ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెళ్లి చేసి పంపడం తమ బాధ్యత అంటూ బాలికల తల్లిదండ్రులు తమ బిడ్డలకు కనీసం 18 ఏళ్ల రాకముందే వివాహాలు చేస్తున్నారన్నారు. ఇలా చేయడం చట్టరీత్యా నేరమని, శారీరక, మానసిక పరిపక్వత ఉండకపోవడం వల్ల ఎన్నో అనర్థాలు జరుగుతాయని వివరించారు. ఉన్నత విద్యనభ్యసించి ఉన్నతస్థాయి ఉద్యోగాలు పొందిన తర్వాత పెళ్లిళ్ల చేసుకోవాలని ఈమేరకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని బాలికలకు ఉద్బోధించారు. బలవంతంగా పెళ్లిళ్ల నివారించేందుకు ప్రభుత్వం 1098 టోల్‌ఫ్రీ నంబరు ఏర్పాటు చేసిందని, దానికి సమాచారం ఇస్తే పోలీసులు వచ్చి రక్షణ కల్పించి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇ స్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ బాలుర వసతి గృహంలో తనిఖీలు

సిద్దవటం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పార్వతీపురం బీసీ బాలుర వసతి గృహాన్ని శనివారం సాయంత్రం బీసీ వెల్ఫేర్ అసిస్టెంట్ అధికారి జ్యోతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రాజునాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

బియ్యం అమ్ముకున్న వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

రాయచోటి టౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ వసతి గృహానికి ప్రభుత్వం సరఫరా చేసిన బియ్యాన్ని అమ్ముకున్న హాస్టల్ వార్డెన్‌తోపాటు, అతనికి సహకరించిన వారిని వెంటనే విధుల నుంచి తొలగించాలని ఆల్‌ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల లవకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన హాస్టల్ వార్డెన్ అక్రమాలపై జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాలివీడు మండల కేంద్రంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహం వార్డెన్ శ్రీనివాసులు గురువారం విద్యార్థుల బియ్యం అమ్ముకునేందుకు సిబ్బంది ఖాదర్‌బాషా, వెంకటేశు ద్వారా తరలిస్తుండగా, ఏఐఎస్ఏ సభ్యులు పట్టుకుని గాలివీడు తహసీల్దార్‌తోపాటు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి సురేశ్‌కు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. దీంతో వారు లోకేషన్‌కు చేరుకున స్టేట్‌మెంట్ రికార్డు చేసి, బియ్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని గోడౌన్‌కు తరలించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఏ జిల్లా అధ్యక్షులు కిరణ్‌కుమార్, వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్య సేవలు మరువరానివి

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య సేవలు మరువరానివని రైల్వేకోడూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి గోశాల దేవి తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరు పార్టీ కార్యాలయంలో దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1921 ఫిబ్రవరి 14న కర్నూలు జిల్లా కల్లూరు మండలం పెద్దపాడు గ్రామంలో దామోదరం సంజీవయ్య జన్మించారన్నారు. 38 ఏళ్ల పిన్న వయసులోనే ముఖ్యమంత్రి పదవిని అలంకరించారన్నారు. తెలుగు బాష వాడుక, భూ సంస్కరణలు అమలు తదితర కార్యక్రమాలు చేశారని గుర్తు చేశారు. సిగమాల రమేష్, రాము, రవి, రాజేష్, నాయకురాళ్ల రాణి, జ్యోతి, హరిత, రూపలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల షెడ్ల పరిశీలన



కోళ్ల ఫారంను పరిశీలిస్తున్న ఏడీఏహెచ్ మాలకొండయ్య

చిన్నమండెం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటికోన గ్రామ పంచాయతీ చిన్నర్సుపల్లెలో ఉన్న కోళ్ల షెడ్లను పశుసంవర్ధకశాఖ రాయచోటి ఉపసంచాలకులు మాలకొండయ్య, స్థానిక పశువైద్యుడు గణేశ్ శుక్రవారం పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా బర్డ్‌ఫ్లూ వ్యాధి ఉందన్న అపోహల నేపథ్యంలో ఈ తనిఖీలు నిర్వహించినట్లు వారు తెలిపారు. అయితే ప్రస్తుతం కోళ్ల ఫారంలో ఎటువంటి మరణం జరగలేదని, ఫారం యజమాని బైమా సెక్యూరిటీ పాటించాలని, ఎటువంటి కోళ్ల మరణాలు సంభవించినా డాక్టర్‌కు తెలియజేయాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని పశువైద్యశాలలో సిబ్బందికి బర్డ్‌ఫ్లూ, 21వ పశుగణనపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఆ శాఖ సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేకువనే ఉపాధి పనులు ప్రారంభించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీ ఆదిశేషారెడ్డి

సిద్దవటం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి కూలీలు వేకువజామునే పనులకు రావాలని పీడీ ఆదిశేషారెడి సూచించారు. మండలంలోని మూలపల్లె, టక్కోలి గ్రామాల్లో చెక్‌డ్యాంలో పూడికతీత, ఫిష్‌పాండ్ పనులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూలీలు వేకువజామునే పనులకు హాజరై నాలుగు గంటలు పని చేయాలని, ప్రతి కూలీకి రూ. 300 కూలి పడేవిధంగా పనులు చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం 2024-25లో మంజూరైన గోకులాల నిర్మాణాలను పరిశీలించారు. సంటిగారిపల్లెలో సుధాకర్‌రెడ్డి సాగు చేసిన నిమ్మ తోటను పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, ఏపీవో నరసింహులు, టెక్నికల్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో క్రీడలకు స్వర్ణయుగం!



మాట్లాడుతున్న హాకీ అసోసియేషన్ నాయకులు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రాథమిక క్రీడల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తగినంత బడ్జెట్ కేటాయించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని అడగడంతో ఆంధ్రప్రదేశ్‌లో క్రీడలకు పూర్వ వైభవం రానున్నదని అన్నమయ్య జిల్లా హాకీ అసోసి యేషన్ సెక్రటరీ నాగేశ్వరరావు, కోచ్ చంద్రశేఖర్ రాయచోటి మండల హాకీ అసోసియేషన్ ప్రెసిడెంట్ దువ్వూరి నరసింహాచారి, అన్నమయ్య జిల్లా హాకీ అసోసియేషన్ ట్రెజరర్ కదీరుల్లాఖాన్‌లు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం వారు రాయచోటి పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో దాదాపు రూ. 43 కోట్లతో క్రీడా సము దాయం, ఖేలో ఇండియా సెంటర్ ఏర్పాటుకు కృషి చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. క్రీడాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి రాష్ట్ర క్రీడాకారులు, మాజీ క్రీడాకారుల తరపున ధన్యవాదాలు తెలుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ క్రీడాకారులు నూరుల్లా, ఇస్మాయిల్, సాధిక్, హుస్సేన్, హాకీ క్రీడాకారులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపు 'హలో బీసీ.. చలో రాయచోటి'



బీసీ సంఘం నేతల సమావేశంలో మాట్లాడుతున్న పద్మయాదవ్

రాయచోటిటౌన్, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): బీసీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే లక్ష్యంతో ఈ నెల 16 న అన్నమయ్య జిల్లా కేంద్రంలోని అజయ్ రెసిడెన్సీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న బీసీ మహా సభను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ అన్నమయ్య జిల్లా అధ్యక్షురాలు పద్మయాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆమె స్థానిక అజయ్ రెసిడెన్సీలో జిల్లా బీసీ సంఘం నేతలతో కలిసి మీడియాతో మాట్లా డారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండలాలే, గ్రామాల నేతలు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బలగాని చిన్నరెడ్డియాదవ్, నాగేశ్వర, మల్లికా ర్జున, వెంకట్రమణ, జయరాం, రవి, రమణ, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌డీఎస్ సేవలు అభినందనీయం



రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న వీఆర్‌డీఎస్ సభ్యులు

వీరబల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నిరుపేద కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు వీఆర్‌డీఎస్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని మాజీ ఎంపీపీ గాలివీటి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వీఆర్‌డీఎస్ సంస్థ 19వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు, రొట్టె పంపిణీ చేశారు. అనంతరం భాస్కర్‌రెడ్డిని సంస్థ ట్రెజరర్ బాబు, రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి, ప్రభుత్వ డాక్టర్ మనీషా, సభ్యులతో కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, వీఆర్‌డీఎస్ సభ్యులు అలీకుమార్, సతీశ్ పాల్గొన్నారు.

ఇంటి స్థలాల కోసం సీపీఐ ధర్నా

పుల్లంపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నిరుపేద లందరి కి ఇంటిస్థలాలు మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి సల్మాన్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం సీపీ ఐ నాయకులు ధ ర్నా చేశా రు. ముందుగా బైపాస్‌రోడ్డు నుంచి తహసీల్దారు కార్యాల యం వరకు సీపీఐ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ పేదలందరికి పట్ట ణాల్లో 2 సెంట్లు, పల్లెల్లో 3 సెంట్లు, అర్హు లందరికి బంజరు భూములు, రేషన్ కార్డులు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

'అండగా నిలిచేవారికే పగ్గాలివ్వాలి'

రాజంపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు అండగా నిలిచే నాయకుడికి రాజంపేట పార్టీ పగ్గాలు ఇవ్వాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాజంపేట రూరల్ మండల అధ్యక్షుడి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలస పక్షుల అసత్య ప్రచారాలు నమ్మవద్దని నాయకులు కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. పరిచయం లేని నాయకులను బరిలో దింపడంతో అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలయ్యామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ కార్యకర్తలకు అండగా ఉండే నాయకుడికి అవకాశం ఇస్తే పసుపు జెండా ఎగరవేసేందకు ప్రతి నాయకుడు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్య, భాను గోపాల రాజు, మోహన్‌రెడ్డి, జంగం శెట్టి సుబ్బయ్య, సుబ్రహ్మణ్యం నాయుడు, కొల్లి రెడ్డయ్య నాయుడు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో మామిడిలో మంచి దిగుబడులు

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పూత దశలో మామిడిలో సస్యరక్షణతో మంచి దిగుబడులు పొందవచ్చునని ఉద్యానవనశాఖ అధికారి నాగమణి తెలిపారు. శుక్రవారం మండలంలోని మద్దిరేవుల, కస్తూరి రాజుగారిపల్లెల్లో మామిడి రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో రైతుసేవా కేంద్ర సహాయకులు లావణ్య, రేఖ, మామిడి రైతులు పాల్గొన్నారు

బాలింతపై భర్త దాడి

అదనపు కట్నం కోసం వేధింపులని ఫిర్యాదు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఒక బిడ్డకు తల్లి అయినా ఇంకా అదనపు కట్నం కావాలని మునగపాటి సాహితిపై ఆమె భర్త నాగమళ్ల హరీష్ దాడి చేశాడు. దాడి సమయంలో బయటి నుంచి ఎవరూ రాకుండా అత్త నాగమల్ల శారద అడ్డుగా నిలిచింది. సాహితి వన్‌టౌన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాల్లోకెళితే.... గతేడాది నాగమళ్ల హరీష్‌కు మార్చి 22న సాహితితో వివాహమైంది. వివాహం సందర్భంగా ఏడు లక్షల రూపాయలు నగదు, 14 తులాల బంగారం ఇచ్చారన్నారు. వివాహమైనప్పటి నుంచీ కొద్ది రోజులు అన్యోన్యంగా వున్నట్లు తెలిపారు. తల్లి మాటలు విని తన భర్త తనను తరుచూ కొడుతున్నట్లు, అదనపు కట్నం తెమ్మని వేధిస్తూ వుండే వాడన్నారు. ఫిబ్రవరి 8న తను ఆడబిడ్డను ప్రసవించినట్లు తెలిపింది. గురువారం పుట్టింట్లో ఉండగా తన భర్త హరీష్ ఇంటి తలుపులు తన్నుకుంటూ వచ్చి అకారణంగా తనను దుర్భాషలాడుతూ బాలింత అని కూడా చూడకుండా దాడిచేశాడని వివరించింది. అక్కడే వున్న తన పిన్ని కొడుకు వంశీక్రిష్ణను చెవిమీద, పిన్నిని కాలితో కొట్టినట్లు తెలిపింది. తన తల్లి వెంకట రంగమ్మపై కూడా దాడి చేసి గాయపరిచినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఇంట్లో వున్న టీవీని పగుల కొట్టినట్లు తెలిపింది. ఇంట్లో ఈ సంఘటన జరుగుతుంటే ఇరుగు పొరుగు రాకుండా అత్త నాగమల్ల శారద బయటే ఉండి వచ్చేవారిని వారించింది సాహితి చెల్లెలు మునగపాటి సుజన ఈ దాడిపై భయపడి బయటికి వెళ్లి పెద్దమనుషులు డాక్టర్ రంగయ్య, సాంబశివారెడ్డిని పిలిచుకుని వచ్చింది. వారు వచ్చి నాభర్త హరీష్‌ను మందలించి పంపించేరు. గాయపడిన వారికి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అర్జీలను త్వరగా పరిష్కరించండి : జేసీ



రీసర్వేను పరిశీలిస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

కలకడ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులో ప్రజలు అందజేసిన ఆర్జీలను త్వరగా పరిష్కరించాలని జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన కలకడ మండలం గుడిబండ పంచాయతీ చొక్కన్నవారిపల్లెలో జరుగుతున్న రీసర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రీసర్వే గురించి పట్టాదారులకు ముందస్తు సమాచారంపై తహసీల్దార్‌ను ఆరాతీశారు. భవిష్యత్‌లో రైతులకు ఎలాంటి భూ సమస్యలు తలెత్తకుండా హద్దులు నిర్ణయించాలని సూచించారు. పీజీఆర్ఎస్ పోర్టల్ ద్వారా అందిన ఆర్జీల పురోగతిపై సమీక్షించారు. అనంతరం పట్టాదారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫణికుమార్, డీటీ భార్గవి, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

డీపీఓలో ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి



దామోదరం సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పోలీసు అధికారులు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర తొలి దళిత, ముఖ్యమంత్రి దివంగత దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు ఏఓ కృష్ణుడు, దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి రెండో ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య తెలుగు జాతి గర్వించదగ్గ గొప్ప వ్యక్తి అని కొనియాడారు. దామోదరం సంజీవయ్య 1921 ఫిబ్రవరి 14న కర్నూలు జిల్లా కల్లూరు మండలం పెద్దపాడులో మునెయ్య, సుంకులమ్మ దంపతులకు జన్మించారని, 1935లో కర్నూలు మున్సిపాలిటీ ఉన్నత పాఠశాలలో చేరి 1938లో ఎస్ఎస్ఎల్‌సీ జిల్లాలోనే ప్రథముడిగా ఉత్తీర్ణుడయ్యారన్నారు. రాష్ట్ర రెండో ముఖ్యమంత్రి, తొలి దళిత ముఖ్యమంత్రిగా సంజీవయ్య సంయుక్త మద్రాసు రాష్ట్రం సహా రాష్ట్రంలో, కేంద్ర ప్రభుత్వంలో అనేక మంత్రి పదవులను నిర్వహించారన్నారు. 38 ఏళ్ల అతిపిన్న వయస్సులో ముఖ్యమంత్రి అయిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు వీజే రామకృష్ణ, జాన్‌జోసెఫ్, పెద్దయ్య, మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్‌రెడ్డి, ఆర్ఎస్ఐలు, డీపీఓ సిబ్బంది, పోలీసులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



రామాపురం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కారు స్కూటీని ఢీకొనడంతో దగ్గుపాటి పెద్ద రెడ్డెయ్య (67) మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఘటనపై ఎస్ఐ వెంకటసుధాకర్ రెడ్డి కథనం మేరకు వివరాల్లోకెళితే.... రామాపురం మండలం కమ్మపల్లెకు చెందిన దగ్గుపాటి పెద్దరెడ్డెయ్య శుక్రవారం తెల్లవారు జామున భార్యతో కలిసి స్కూటీపై స్వగ్రామానికి వస్తూ, బండపల్లె వద్ద రోడ్డు దాటుతుండగా రాయచోటి నుంచి కడప వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ సంఘటనలో దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. రామాపురం పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం రాయచో టి ప్రభుత్వాస్పత్రికి తరలించగా. చికిత్స పొందుతూ పెద్దరెడ్డెయ్య మృతి చెందాడు. భార్యను మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సాంకేతిక కారణాలతో రైలు ఆలస్యం

సిద్దవటం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కనుమలోపల్లె రైల్వే ట్రాక్‌పై శుక్రవారం సాయంత్రం 5 గంటలకు తిరుపతి నుంచి నంద్యాలకు వెళుతున్న డెమో ఎక్స్‌ప్రెస్ ఇంజన్ సాంకేతిక కారణాలతో నిలుపుదల చేశారు కడప నుంచి మరో ఇంజన్‌ను తెప్పించి పంపించామని రైల్వే సిబ్బంది తెలిపారు.

నందలూరులో స్టాపింగ్ ఇవ్వండి

నందలూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నందలూరు రైల్వే స్టేషన్‌లో రైళ్లకు స్టాపింగ్ ఇవ్వాలని నందలూరు రైల్వేస్టేషన్ కన్సలేటివ్ మెంబర్ రాచూరి మురళి శుక్రవారం సికింద్రాబాద్‌లో సౌత్‌సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ఇంటర్ సిటీ ప్యాసింజర్ ప్రారంభించాలని, వెంకటాద్రి, చెన్నై సూపర్ ఫాస్ట్, ముంబై సీఎస్ఎంటీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లకు నందలూరు రైల్వేస్టేషన్‌లో స్టాపింగ్ ఇవ్వాలని కోరారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

మార్చి1 నుంచి 20 వరకు పరీక్షలు : కలెక్టర్

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియేట్ పబ్లిక్ పరీక్షలను సజావుగా, పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్లో ఇంటర్ పబ్లిక్ పరీక్షల నిర్వహణ ఏర్పాటల్లపై డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, కమిషనరు మనోజ్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులతో కలిసి నిర్వహించిన పరీక్షల నిర్వహణ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియేట్ బోర్డు నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం జూనియర్, సీనియర్ ఇంటర్ అభ్యర్థులకు మార్చి1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లాలో మొత్తం 64 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. అన్ని ప్రైవేట్ కళాశాలల్లో సీసీ కెమెరాలను తప్పక అమర్చాలన్నారు. గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు, రెవెన్యూ అధికారులకు సూచించారు. ఆర్ఐఓ వెకటసుబ్బయ్య విద్యాశాఖ, పోలీసు, రెవెన్యూ విద్యుత్, వైద్యతదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు.. ఆదాయం బాగు

- నాలుగు ఎకరాల్లో 40 రకాల పంటలు
- ఐదేళ్లుగా 28 దేశాల శాస్త్రవేత్తలు రాక
- ఆదర్శంగా నిలుస్తున్న మహిళా రైతు



ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో సాగు చేసిన కూరగాయల పంట

వాల్మీకిపురం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువులతో పెట్టుబడులు పెట్టి నష్టాలను చవిచూసిన ఓ మహిళా రైతు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపి పలువురు రైతులకు ఆదర్శంగా నిలిచారు. మండలంలోని అయ్యవారిపల్లెకు చెందిన స్వాతి, రాజారెడ్డి దంపతులు తొమ్మిదేళ్లగా ప్రకృతి వ్యవసాయంతో మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. గ్రామంలో ఉన్న నాలుగు ఎకరాల వ్యవసాయ పొలాల్లో 40 రకాలకు పైగా పంటలు సాగు చేసి దిగుబడులను రాబడుతున్నారు. రసాయనిక ఎరువులను పూర్తిగా నిషేధించారు. ఎర్ర ఇసుక నేలల్లో వ్యవసాయ విధానం మంచి ఫలితాలనే ఇస్తోంది. తక్కువ పెట్టుబడులతో విభిన్న రకాల పంటలు సాగు చేస్తూ మంచి లాభాలనే గడిస్తున్నారు. సాగు చేసిన పంటలు సమీప ప్రాంత రైతులకు అవగాహన కల్పించి ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపేలా శ్రీకారం చుట్టారు. ఇంటర్మీడియేట్ చదువుకున్న మహిళా రైతు స్వాతి ప్రకృతి వ్యవసాయంతో కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. నాలుగెకరాల్లో సాగు చేసిన పంటలు ఏమాత్రం నష్టాల బాట పట్టకుండా తమదైన శైలిలో పర్యవేక్షిస్తూ సాగు పద్ధతులను వృద్ధి చేసుకుంటున్నారు.

ప్రకృతి వ్యవసాయంలో పండించే పంటలు

ప్రకృతి వ్యవసాయం ద్వారా మిరప, ఉల్లి, అలసంద, బెండ, జామ, కొత్తమీర, మెంతులు, చుక్కాకు, ముల్లంగి, బంతి, మొక్కజొన్న, టమోటా, కాకర, బీర, గోరుచిక్కుడు, వంగ, అల్లనేరేడు, ఆముదం, గోంగూర, ఆవాలు, దోస, కీరదోస, బొప్పాయి ఇలా 40కి పైగా వివిధ రకాల పంటలు ప్రకృతి వ్యవసాయంలో సాగు చేస్తుండడం గమనార్హం.

పంటల కోసం జీవామృతం..

పశువుల పేడ, మూత్రము, బెల్లం, పప్పుదినుసుల పిండి, పుట్టమట్టితో జీవామృతం చేసుకుని తద్వారా ముందుగా దుక్కిలో 400 కిలోల ఘనజీవామృతం వేసి దుక్కి చేసుకోవడం, బీజామృతంతో నారు, విత్తనాల శుద్ధి, ప్రతి 15 రోజులకు ఒకసారి 400 లీటర్ల ద్రవ జీవామృతం పిచికారీ చేయడం, 200 లీటర్ల నీమాస్త్రంను, 20 లీటర్ల దశకర్ణి, 200 లీటర్ల పుల్లటి మజ్జిగను పిచికారీ చేసి తయారు చేసుకుంటారు. పంటల్లో పురుగుల నివారణకు 15 పసుపు, 10 బ్లూ ప్లేట్లు, 8 లింగాకర్ష బుట్టలు, 6 పక్షి స్థావరాలను ఏర్పాటు చేసుకుంటారు. అంతర పంటలుగా బంతి, మొక్కజొన్న సాగు చేసి మంచి ఫలితాలు సాధిస్తున్నారు.



ప్రకృతి వ్యవసాయ పంటలు పరిశీలిస్తున్న విదేశీ శాస్త్రవేత్తలు (ఫైల్)

వాల్మీకిపురంలో ప్రత్యేక స్టాల్స్..

ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పంటలను వాల్మీకిపురం మహిళా సమాఖ్య కార్యాలయం ఎదుట ప్రతి సోమవారం స్టాల్స్ ఏర్పాటు చేసి ఆకుకూరలు, కూరగాయలు తదితరం విక్రయిస్తుంటారు. అలాగే వారంలో జరిగే సంతలకు, అంగన్వాడీ కేంద్రాలకు కూరగాయలు అందిస్తుంటారు. ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా పెట్టుబడులు తగ్గి పంటలో దిగుబడి రావడమే కాకుండా భూమి సారవంతంగా వచ్చేందుకు తోడ్పడుతున్నారు. రసాయన వ్యవసాయం చేసి తీవ్రంగా నష్టపోయిన తమకు ప్రకృతి సాగు లాభిస్తోందన్నారు. ఐదేళ్లగా వివిధ దేశాల శాస్త్రవేత్తలు, వివిధ రాష్ట్రాల రైతులు, ఉద్యానవన, వ్యవసాయ అధికారులు అయ్యవారిపల్లె గ్రామ సమీపంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించడం గమనార్హం.



ప్రతి సోమవారం ఏర్పాటు చేసే ప్రకృతి వ్యవసాయ కూరగాయల స్టాల్స్

ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలి



రసాయన వ్యవ సాయం ద్వారా నష్టాలు తప్ప పెట్టుబడులు రాబట్టుకునే పరిస్థితులు కనుమరుగయ్యాయి. సులభతరమైన ప్రకృతి వ్యవసాయం ప్రతి రైతు చేయగలిగితే నష్టాల మాటే ఉండదు. రైతుకు తనకున్న పొలంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేయడం ఎన్నో లాభాలను తెచ్చి పెడుతుందనడంలో సందే హం లేదు. 9 ఏళ్ల కాలంగా ప్రకృతి వ్యవసా యం చేస్తున్నా ఏనాడు నష్టాల బాధలు పడలేదు.

- స్వాతి, మహిళా రైతు, అయ్యవారిపల్లె

మహిళా రైతుకు చంద్రబాబు అభినందన

ప్రకృతి వ్యవసాయంలో రాణిస్తున్న మహిళా రైతు స్వాతి 2018లో సీఎం చంద్రబాబు ద్వారా సన్మానం, అభినందనలు అందుకున్నారు. ప్రకృతి వ్యవసాయంలో 3 నెలల డిప్లమో కోర్సు పూర్తి చేసిన స్వాతికి కిసాన్‌మేళా, పాలేకర్ శిక్షణ ద్వారా ప్రశంసాపత్రాలు, మహిళా రైతు, ఉత్తమ మహిళా రైతు అవార్డులు సొంతం చేసుకున్నారు.

అభివృద్ధే పూర్వవిద్యార్థి తపన





పాఠశాల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న శకుంతులమ్మ - పాఠశాల నూతన భవనం

పెద్దతిప్పసముద్రం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): శిథిలావస్థకు చేరుకున్న పాఠశాలను అభివృద్ధి చేయాలనే తపనతో ఉన్నత శిఖరాలకు చేరుకున్న పూర్వవిద్యార్థులు, గ్రామస్తుల సహకారంతో ప్రాథమిక పాఠశాల నూతన భవ నానికి నోచుకుంది. వివరాల్లోకెళితే...

కర్ణాటక సరిహద్దుగా ఉన్న టి.సదుం పంచాయతీ రామాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉంది. పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో అభివృద్ధిపై గ్రామస్థులు గానీ, ప్రభుత్వ అధికారులు గానీ పట్టించుకోలేదు. 30 ఏళ్ల కిందట రామాపురం వాసి శకుంతలమ్మ చదువుకున్నారు. ప్రస్తుతం ఆమె మంచి ఉన్నత స్థానంలో ఉన్నారు. ఇటీవల తమ స్వగ్రామం రామాపురానికి వచ్చిన ఆమె తాను చదివిన పాఠశాల భవనం చూసి మనసు ద్రవించి పోయింది. వెంటనే శకుంతలమ్మ పాఠశాలకు వెళ్లి అక్కడ శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాన్ని చూసి నూతన భవనం నిర్మించాలని అనుకున్నారు. తమ గ్రామస్థులైన తనతో పాటు చదువుకున్న విద్యార్థులను కొందరిని పోగు చేసి పాఠశాల భవనం గురించి వారికి వివరించారు. తనతోపాటు తన స్నేహితుల సహకారంతో సుమారు రూ.5లక్షలు వెచ్చించి విద్యార్థులకు చక్కటి పాఠశాల భవనాన్ని నిర్మించారు. అందరి సహకారంతో నిర్మించిన పాఠశాలను శుక్రవారం ఎంఈఓ నారాయణ ప్రారంభించారు. పాఠశాల భవనాన్ని అన్ని వసతులతో నిర్మించిన దాత శకుంతలమ్మ సహా పలువురు విద్యార్థులు, గ్రామస్థులను అభినందించారు. దాతల సహాయ సహకారాలతో నిర్మించిన పాఠశాలలో నేటి విద్యార్థులు చదువుకుని ఉన్నత శిఖరాలకు వెళ్లి అందరికీ ఆదర్శప్రాయంగా నిలవాలని ఎంఈఓ సహా పలువురు వక్తలు సూచించారు. కార్యక్రమంలో ములకల చెరువు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి, స్థానిక పాఠశాల ఉపాధ్యాయురాలు తేజశ్రీ, అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు, అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

తిరుపతి నుంచి గల్ఫ్‌కు విమానాలు నడపండి

రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి

రాజంపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గల్ఫ్ దేశాలకు తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అనుమతి కల్పించాలని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ రెడ్డి న్యూ ఢిల్లీలో తిరుపతి ఎంపీ గురుమూర్తితో కలసి కువైట్ రాయబారి మేషల్ ముస్తాఫ ఆల్ షేమలికి వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి కడప, అన్నమయ్య, చిత్తూరు, నెల్లూరు జిల్లాలోని ప్రజలు జీవనోపాధి కోసం గల్ఫ్ దేశాలైన కువైట్, కత్తర్, దుబాయ్, సౌదీ దేశాలకు వెళ్లాలంటే పక్క రాష్ట్రం చెన్నై వెళ్లాలన్నారు. ఈ సమస్యకు పరిష్కారం తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం ఒకటే మార్గం. తిరుపతి అంతర్జాతీయ ప్రమాణాలతో నూతన టెర్మినల్ ఏర్పాటు చేసినా ఇంకా పూర్తి స్థాయిలో విమానాల రాకపోకలు ప్రారంభించలేదన్నారు. తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంలో గల్ఫ్ దేశాలకు రాకపోకలు ప్రారంభించాలని కోరారు.

'సహజ సౌందర్యానికి' ఆంక్షల బ్రేక్



- బోసిపోతున్న... హార్సిలీహిల్స్
- యువతను హడలెత్తిస్తున్న తనిఖీలు
- బాగా దెబ్బతిన్న టూరిజం.. ప్రైవేట్ బిజినెస్
- టోల్‌గేట్‌ను వదిలేసిన కాంట్రాక్టర్



హిల్స్‌పై ఖాళీగా వున్న ఫారెస్ట్ క్యాంపస్

బి.కొత్తకోట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి)

కదలాడే మేఘాల సౌందర్యం.. కనువిందుచేసే ప్రకృతి సోయగం.. పరవశింప జేసే గంధపు గాలుల పరిమళం.. మండు వేసవిలో సైతం మైమరిపించే శీతల వాతావరణం హార్సిలీహిల్స్ సొంతం. ఆంధ్రా ఊటీగా పేరుగాంచి, సముద్రమట్టానికి 4212 అడుగుల ఎత్తులో వుండి... జాతీయ స్థాయి గుర్తింపు పొందిన అన్నమయ్య జిల్లా, బి.కొత్తకోట మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్ నేడు పర్యాటకులు లేక బోసిపోతోంది. పర్యాటకుల ఆకర్షణ, అభివృద్ధి కోసం తగిన చర్యలు తీసుకోవాల్సిన టౌన్‌షిప్ కమిటీ ప్రేక్షకపాత్ర పోషిస్తుండడం, పర్యాటక శాఖ నిధులు కేటాయించక పోవడం ఒక కారణమైతే, తాజాగా అధికారులు తీసుకునే చర్యలు పర్యాటకులను దూరం చేస్తున్నట్లు ప్రచారం. ఫలితంగా ఉపాధి కోల్పోయి వందల మంది రోడ్డున పడ్డారు.



హార్సిలీహిల్స్ దిగువ భాగంలో పోలీస్ చెక్‌పోస్ట్

అవుట్‌పోస్ట్‌తో యువత హడల్

మదనపల్లె, అంగళ్లు వద్దనున్న ఇంజనీరింగ్, డిగ్రీ కాలేజీ విద్యార్థులు, వారాంతంలో బెంగళూరు నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, కదిరి, రాయచోటి, చింతామణి తదితర ప్రాంతాల నుంచి హార్సిలీహిల్స్‌కు పెద్దసంఖ్యలో యువతీ యువకులు చేరుకుని సందడి చేస్తుంటారు. బ్యాచ్‌లుగా కొందరు, జంటలుగా కొందరు ద్విచక్రవాహనాల్లో వచ్చి సరదాగా గడుపుతారు. హిల్స్ ఘాట్‌రోడ్డులో కేరింతలు కొడుతూ, సెల్ఫీలు, వీడియోలు తీసుకుంటూ ఎంజాయ్ చేసి కొందరు తిరుగుముఖం పడితే, మరికొందరు బుక్ చేసుకున్న అతిథిగృహాల్లో బసచేసి మరుసటిరోజు వెళ్లేవారు. దీంతో ఘాట్‌రోడ్డు మలుపులు, కొండపైనున్న వ్యూ పాయింట్ యువత సందడితో కళకళలాడేవి. కొంతకాలంగా ఈ సరదాలకు ఆంక్షల రూపంలో బ్రేక్ పడింది. బి.కొత్తకోట పోలీసులు కొండ దిగువ భాగంలో అవుట్‌పోస్టును ఏర్పాటు చేసి, పైకి వెళ్లే ప్రతి వాహనాన్నీ ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఎవరొచ్చినా వారి వారి ఐడీ ప్రూఫ్‌లు అడగడం, వారి ఇళ్లకు ఫోన్‌లు చేస్తుండడంతో యువత హడలెత్తి హార్సిలీహిల్స్‌కు రావడం మానుకుని ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకుంటున్నట్లు తెలుస్తోంది. యువతీ యువకులను అనుమతించక పోవడంతో కొన్ని కుటుంబాలు మాత్రమే హిల్స్‌ను సందర్శిస్తున్నారు.

బాగా దెబ్బతిన్న బిజినెస్...

పర్యాటకుల రాక తగ్గడంతో ఏపీ టూరిజం అతిథి గృహాలు, బార్ రెస్టారెంట్, అటవీశాఖ ప్రాంగణంలో బిజినెస్ బాగా తగ్గినట్లు సిబ్బంది చెబుతున్నారు. కొండపై చిన్నా, చితక వ్యాపారాలతో జీవనం సాగించే కుటుంబాలు బావురుమంటున్నాయి. పర్యాటకులను కింది నుంచి పైకి తరలించే ప్రైవేటు వాహనదారులు ఉపాధి కోల్పోయారు. అప్పటి ఆదాయంలో పాతికభాగం కూడా లేదంటున్నారు.

టోల్‌గేటును వదులుకున్న కాంట్రాక్టర్

వాహనాలను కొండమీదకు అనుమతించే టోల్‌గేటుకు టౌన్‌షిప్ కమిటీ ఆధ్వర్యంలో వేలం నిర్వహిస్తారు. ఈ ఏడాది రూ.46లక్షలకు ఓ వ్యక్తి పాడుకున్నాడు. ఆదాయం వచ్చే కీలక సమయాల్లో ద్విచక్ర వాహ నాలను, ఆటోలను అనుమతించక పోవడం, ప్రస్తుతం యువత రాకపై ఆంక్షలు విధించడంతో ద్విచక్రవాహనాల సంఖ్య బాగా తగ్గిపోయింది. ఫలితంగా భారీ నష్టాలు తప్పవని భావించిన కాంట్రాక్టర్ టోల్‌గేట్‌ను వదులుకున్నాడు. ప్రస్తుతానికి వచ్చే అరకొర వాహనాలకు రెవెన్యూ సిబ్బందే రుసుము వసూలు చేయాల్సి వస్తోంది. సంబంధిత అధికారులు హార్సిలీహిల్స్‌లో పర్యాటకుల సంఖ్య సాధారణ స్థితికి వచ్చేలా చూడాల్సి వుంది.



జనం లేక బోసిపోతున్న హార్సిలీహిల్స్ ప్రధాన సర్కిల్

కరెంటు వైర్లే వారి టార్గెట్



- అప్రమత్తంగా లేకుంటే అంతే..
- కొత్తగా నిర్మిస్తున్న ఇళ్లలో చోరీలు
- పోలీసుల నిఘా అంతంత మాత్రమే

కడప క్రైం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఇప్పుడు కడప నగరంలో కొత్తరకం చోరీలు జరుగుతున్నాయి. నూతనంగా నిర్మించిన.. నిర్మిస్తున్న ఇళ్లను టార్గెట్ చేసుకొని దొంగతనాలకు పాల్ప డుతు న్నారు. ఇళ్లలో కొత్తగా వైరింగ్ చేసిన రాగి వైర్లను చోరీ చేస్తున్నారు. ఆ వైరును కాల్చి రాగితీగను అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. వచ్చిన డబ్బుతో జల్సాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి దొంగ తనాలపై బాధితులు పోలీసులను ఆశ్రయించలేకపోతున్నారు.

కడప నగర శివార్లలో ఉన్న వెంచర్లు, జగనన్న కాలనీల్లో నూతనంగా నిర్మిస్తున్న ఇళ్లను టార్గెట్ చేసుకుంటారు. వైరింగ్ కనెక్షన్లు, శానిటైషన్ పనులు జరుగుతున్న ఆ ఇళ్లపై పక్కాగా రెక్కీ నిర్వహించి... రాత్రుళ్లు అక్కడ ఎవరూ లేని సమయంలో వైర్లను పైపుల్లో నుంచి మొత్తం లాగి తీసుకెళుతున్నారు. ఇలాంటి దొంగతనాలు నగరంలో తరచూ జరుగుతున్నాయి. అయితే బాధి తులు కొందరు పోలీసులకు ఫిర్యాదు చేస్తే మరికొందరు విద్యుత్ వైర్లే కదా అని వదిలేస్తున్నారు.

పులివెందుల రోడ్డులోని కొన్ని ఏరియాల్లో నూతనంగా ఇళ్లనిర్మాణాలు చేపట్టారు. ఓ వ్యక్తి కరెం టు కనెక్షన్ లాగేందుకు పైపుల్లో వైర్లను లాగి ఆ ఇంటికి తాళాలు వేసుకుని వెళ్లాడు. అయితే ఇం టి తాళాలు పగలగొట్టకుండానే మెయిన్ పైపుల ద్వారా వైర్లు మొత్తం లాగేసుకుని అపహరించా రు. ఇదే తంతు చుట్టుపక్కల కూడా జరగడంతో చేసేదేమీలేక మరోమారు వైరు కనెక్షన్‌ను ఇచ్చుకున్న పరిస్థితి. అలాగే రామాంజనేయపురంలో టిడ్కో జగనన్నకాలనీలో కూడా తరచూ ఇలాంటి దొంగతనాలే జరుగుతున్నాయి.

మైనర్లతోనే చోరీలు

కొంత మంది మైనరు యువకులు మత్తుకు అలవాటు పడి డబ్బులు కోసం ఇలాంటి చోరీలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. మైనర్లు కావడం తో వారిపై ఎలాంటి కేసులు ఉండవనే ఉద్దేశ్యంతో కొంత మంది వీరిని ఉపయోగించుకుని ఇలాంటి చోరీలకు పాల్పడుతున్నారు. దొంగలించిన వైరులోని కాపర్, సిల్వర్ తీసుకుని గుజిరి వ్యాపారు లకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

కొరవడుతున్న నిఘా

నూతన భవన నిర్మాణాల్లో కరెంటు వైర్ల దొంగతనాలపై పోలీసులు నిఘా అంతంత మాత్రమే ఉంది. అలాగే ఇంటి నిర్మాణ యజమానులు సైతం భవన నిర్మాణ సమయంలో ఇంట్లో విలువైన వస్తువులు ఉన్నప్పటికీ వారు కూడా తాళాలు వేసుకుని వెళుతుండడంతో.. రాత్రి సమయంలో చోరీకి పాల్పడుతున్నారు. అక్కడ వాచ్ మెన్ కానీ, ఇంటిలో కాపలా ఎవరైనా ఉంటే ఇలాంటి చోరీలు జరగకుండా నివారించవచ్చు.

విశ్వనాథ్ కుటుంబానికి ఆదానీ కంపెనీ రూ.15 లక్షల పరిహారం



విశ్వనాథ్ తండ్రి బలరామయ్యకు రూ.15లక్షల చెక్కును అందజేస్తున్న ఆదానీ కంపెనీ ప్రతినిధులు

కొండాపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ట్యాంకర్ కింద పడి మృతి చెందిన మండలంలోని తిరుమలాయపల్లె గ్రామానికి చెందిన విశ్వనాథ్ కుటుంబానికి ఆదానీ కంపెనీ రూ.15లక్షలు చెల్లించింది. కంపెనీ ప్రతినిధులు శుక్రవారం రూ.15లక్షల చెక్కును తండ్రి బలరామయ్యకు అందజేశారు. పరిహారం చెల్లించాలంటూ విశ్వనాథ్ కుటుంబంతో పాటు తిరుమలాయపల్లె గ్రామస్థులు గురువారం ఆదానీ కంపెనీ వద్ద విశ్వనాథ్ మృతదేహంతో ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో ఆదానీ కంపెనీ దిగి వచ్చింది. దీంతో రూ.15లక్షల పరిహారంతో పాటు భవిష్యత్తులో విశ్వనాథ్ అక్కకు ఆదానీ కంపెనీలో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చినట్లు విశ్వనాథ్ బంధువులు తెలిపారు. అదేవిధంగా కంపెనీ సబ్ కంట్రాక్టర్ చెన్నారెడ్డి రూ.8లక్షలు, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కుటుంబ సభ్యులు రూ.3లక్షలు విశ్వనాథ్ తండ్రి బలరామయ్యకు అందజేశారు.

ఆటో ఢీ... వ్యక్తి మృతి



రంజయ్‌మెహతో మృతదేహం

మైలవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దొడియం గ్రామ సమీపంలో నక్కవానిపల్లె వైపు వెలుతున్న రంజయ్‌మెహతో (43) అనే వ్యక్తిని ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఢీకొనడంతోమృతి చెందినట్లు ఎస్ఐరంతుల్లారెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. బీహార్ రాష్ట్రానికి చెందిన రంజయ్‌మెహతో సోలార్ కంపెనీలో కూలీ పనులు చేసుకుంటూ ఉండేవాడు. గురువారం రాత్రి రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న సమయంలో ట్రాక్టర్ ఢీకొనడంతో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుండెపోటుతో ఈఓఆర్‌డీ మృతి



మూరతోటి సుధాకర్ (ఫైల్‌ఫోటో)

మైదుకూరు రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్ర జ్యోతి): మం డలంలోని వనిపెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఇన్‌చార్జ్ ఈఓఆర్‌డీగా పనిచేస్తున్న మూరతోటి సుధాకర్ శుక్రవారం తెల్లవా రుజామున గుండెపోటుతో మృతి చెందాడు. బంధువుల వివరాల మేరకు.. సుధాకర్ గత ఐదేళ్లుగా మైదుకూరు మండలంలో పనిచేస్తున్నారు. ఆయన సొంత గ్రామమైన బద్వేలులో శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆటో బోల్తా.. 8 మందికి గాయాలు



గాయపడ్డ అనంతపురంవాసులు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మార్కాపురం వద్ద ఆటో బోల్తా పడడంతో 8 మందికి గాయాలయ్యాయి. అనంతపురం జిల్లాకు చెందిన 8 మంది శివభక్తులు మొక్కుబడి తీర్చుకునేందుకు ఆటోలో బయల్దేరి పోరుమామిళ్ల మీదుగా శ్రీశైలం వెలుతుండగా మార్కాపురం సమీపంలో గేదెలు అడ్డం రావడంతో వాటిని తప్పించబోయి బోల్తాపడింది. దీంతో ఆటోలోని 8 మందికి గాయాలయ్యాయి. వెంటనే వారిని 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో లక్ష్మి నారాయణ, లక్ష్మినరసింహులు, సాకే నరసింహులు, పి.జయచంద్ర, లక్ష్మినరసింహులు, యశ్వంత్‌తో పాటు మరొకరు ఉన్నారు.

పురుగులమందు తాగి ఒకరు మృతి

మరొకరికి అస్వస్థత



విష్ణువర్ధన్ (ఫైల్)

చెన్నూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు కు చెందిన విష్ణువర్ధన్ (31), లక్ష్మణ్ (35) అనే యువకులు వేర్వేరు కారణాలతో శుక్రవారం పురుగులమందు తాగారు. వీరిలో విష్ణువర్ధన్ మృతి చెందగా, లక్ష్మణ్ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. పోలీసుల వివరాల మేరకు.. చెన్నూరు భవానీనగర్‌కు చెందిన జింకా విష్ణువర్ధన్ స్థానికంగా ఓ సెల్‌పాయింట్ పెట్టుకుని జీవించేవాడు. వ్యాపారం సరిగ్గా జరగక రెండు నెలల క్రితం మూసివేశాడు. దీంతో అప్పులపాలు కావడంతో తీవ్ర మనస్థాపానికి గురై శనివారం ముండ్లపల్లె రోడ్డులో పురుగులమం దు తాగాడు. అలాగే అతని స్నేహితుడు లక్ష్మణ్ సైతం మనస్థాపంతో పురుగులమందు తాగాడు. విష్ణువర్ధన్ ఇంటికి రాకపోవడంతో బంధువులు గూగుల్ మ్యాప్ ద్వారా గుర్తించి కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొం దుతూ మృతి చెందాడు. అలాగే లక్ష్మణ్‌ను కడప నగరంలోని ఓ ప్రైవే టు ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు కర్నూలుకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అర్జీల పరిష్కారానికి బాధ్యతాయుతంగా పని చేయాలి

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్



మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలపై వచ్చిన ఆర్జీల పరిష్కారానికి బాధ్యతాయుతంగా, జవాబుదారీతనంతో పని చేయాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో కలెక్టర్ అధ్యక్షతన బద్వేలు, కడప రెవెన్యూ డివిజన్ల పరిధిలోని రెవెన్యూ అధికారులకు రెవెన్యూ అంశాలు, వివిధ చట్టాలపై ఒక రోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 80శాతం పైగా రెవెన్యూ సమస్యలపైనే అర్జీలు వస్తున్నాయన్నారు. ఇందుకు సంబంధించి కడప, బద్వేలు రెవెన్యూ డివిజన్ల ఆర్డీవోల పరిధిలోని సర్వేయర్లు, వీఆర్వోలు, డిప్యూటీ తహశీల్దార్లు, తహశీల్దార్లకు రెవెన్యూ అంశాలకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించామన్నారు. ఆయా మండల పరిధిలో తహశీల్దార్లు కూడా కార్యాలయ సిబ్బందితో రెవెన్యూ సమస్యలపై వర్క్ షాపు నిర్వహించుకోవాలన్నారు. మండలాల్లో ఆయా గ్రామాలకు సంబంధించిన అర్జీలను పరిశీలించి ఏ అంశాలపై అర్జీలు వచ్చాయో క్రోడీకరించుకోవాలన్నారు. అలాగే పీజీఆర్‌ఎస్, రెవెన్యూ సదస్సులు, రీ సర్వేలో వచ్చిన అర్జీలను పరిశీలించి డూప్లికేట్ అర్జీలను తొలగించాలన్నారు. అర్జీలను నిశితంగా పరిశీలించి సమస్యలను తెలుసుకుంటూ అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారాలు చూపాలన్నారు. ముఖ్యంగా రెవెన్యూ అధికారులు వారంలో 4 రోజుల పాటు గ్రామాల్లో విజిట్ చేయాలన్నారు. రెవెన్యూలో అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అధికారులు అసైన్డ్ భూములు, ఆర్‌ఓఆర్ పట్టాదారు పాస్ పుస్తకాలు, చట్టాలు తదితర అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అతిదిసింగ్ రెవెన్యూ సదస్సులు, రీ సర్వే, గ్రామ సభలు, ఫ్రీహోల్డ్‌భూముల మానిటరింగ్ చేస్తున్నారని.. అందుకనుగుణంగా రెవెన్యూ సిబ్బంది నిబద్దతో పని చేయాలన్నారు. సమా వేశంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఆర్డీవో జాన్‌ఇర్విన్, బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్, తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్వోలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

వైవీయూలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగం ఏర్పాటు



వీసీ ప్రొఫెసర్ కృష్ణారెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వైవీయూ ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి వెల్లడించారు. శుక్రవారం విశాఖపట్టణం హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్‌తో వైవీయూ ఒప్పందం కుదుర్చుకుంది. ఈమేరకు వైవీయూ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి సమక్షంలో కులసచివులు ఆచార్య పుత్తా పద్మ, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథ్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ తుంగ శ్రీకాంత్, నేషనల్ మెంబర్ పి.దయాకర్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ ఈ ఎంఓయూ ద్వారా లభించే శిక్షణతో విద్యార్థులలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు. సమావేశంలో పర్యావరణ శాఖ సహా ఆచార్యులు డాక్టర్ టి. చంద్రశేఖర్, హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ కడప జిల్లా ఆర్గనైజింగ్ కమీషనర్ జి.వెంకట సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

20 మంది రెవెన్యూ సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు

కడప కలెక్టరేట్ ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాలుగు రెవెన్యూ డివిజన్ల పరిధిలో వివిధ మండలాల్లో పని చేస్తున్న 20మంది రెవెన్యూ సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ సంబంధిత విషయాలు, మ్యుటేషన్ తదితర సమస్యలు పరిష్కరించడంలో ఆర్ఐలు, వీఆర్వోలు, సర్వేయర్లు అవినీతికి పాల్పడుతున్నట్లు ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. ఈ మేరకు 20 మంది సచివాలయ, రెవెన్యూ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. వారిపై క్రమశిక్షణ చర్యలు కూడా తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. బద్వేలు మండలం తిప్పనపల్లి సెక్రటేరియట్ వీఆర్వో సాలమ్మ, చక్రాయపేట మండలం సురభి సెక్రటేరియట్ సర్వేయర్ విజయకుమార్, దువ్వూరు వీఆర్వో కె.మునిస్వామి, దువ్వూరు మండలం ఇడమడక వీఆర్వో హరియాదవ్, జమ్మమడుగు మండలం బి.బొమ్మపల్లి వీఆర్వో భీమన్న, కడప మండలం మామిళ్లపల్లి వీఆర్వో జహీర్ అబ్బాస్, ఉక్కాయపల్లి వీఆర్వో శ్రీనివాసులు, కలసపాడు మండలం ఎగువ రామాపురం వీఆర్వో కొండయ్య, పిడుగుపల్లి వీఆర్వో ఆనందరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌రావు, కమలాపురం మండలం కోగటం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అర్జున్, లేటపల్లె వీఆర్వో వెంకట రామన్న, మైదుకూరు మండలం ముదిరెడ్డిపల్లి వీఆర్వో మధుడేవిడ్, మైలవరం మండలం తలమంచిపట్నం వీఆర్వో ఓబులేసు, రాజుపాలెం మండలం టంగుటూరు వీఆర్వో సరళ, వల్లూరు మండలం వీఆర్వో ఖాజీమొహిద్దీన్, వేంపల్లి మండలం రామిరెడిపల్లి వీఆర్వో ఓబయ్య, ఒంటిమిట్ట మండలం మంటపంపల్లి వీఆర్వో శ్రీనివాసులు, వేంపల్లి మండలం కథలూరు సర్వేయర్ బ్రహ్మయ్య, వేంపల్లి మండల సర్వేయర్ బ్రహ్మకుమార్‌రెడ్డిలు ఉన్నారు.

కువైత్‌లో వ్యక్తి మృతి

ఓబులవారిపల్లి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మపల్లి చిన్న ఓరంపాడు హరిజనవాడకు చెందిన రవికుమార్ (39) కువైత్‌లో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొంతకాలం క్రితమే ఉపాధి కోసం కువైత్ వెళ్లాడని, అక్కడ సెంట్రింగ్ పనులు చేస్తుండగా లిఫ్ట్‌లోంచి జారి పడడంతో మృతి చెందాడన్నారు. మృతదేహాన్ని శనివారం స్వగ్రామానికి తీసుకురానున్నారని వివరించారు.

బాలికపై లైంగికదాడి.... వ్యక్తిపై పోక్సో కేసు

ప్రొద్దుటూరు ,ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన ఓ బాలికకు మాయ మాటలు చెప్పి లైంగికదాడికి పాల్పడిన కుళాయప్ప అలియాస్ హర్ష అనే (23) యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ భావన తెలిపారు. ఈనెల 10 తేదీ నుంచి బాలిక ఇంటి నుంచి తప్పిపోయినట్లు కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈమేరకు గత రెండు రోజులుగా త్రీటౌన్ సీఐ గోవింద రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు తీవ్రంగా గాలించి పట్టుకున్నారు. బాలికకు మాయ మాటలు చెప్పి కిడ్నాప్ చేసి మానసికంగా శారీరకంగా హింసించిన కుళాయప్పపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

ఆలయాల్లో చోరీలకు పాల్పడే ఇద్దరి అరెస్టు

- రూ.12లక్షలు విలువచేసే బంగారు, వెండి వస్తువులు స్వాధీనం



చోరీకి పాల్పడిన నిందితులు, స్వాధీనం చేసుకున్న ఆభరణాలను చూపుతున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆలయాలను టార్గెట్‌గా చేసుకొని మధ్యాహ్న సమయంలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.12లక్షలు విలువచేసే బంగారు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి శుక్రవారం సాయంత్రం జమ్మలమడుగు అర్బన్ పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ వెంకటేశ్వరరావు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జమ్మలమడుగులో ఈనెల 5వ తేదీ నాగులకట్ట ఆలయంలో అమ్మవారి బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేసినట్లు ఆలయ అధ్యక్షుడు జి.తిరుమలదాసు అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా శుక్రవారం తాడిపత్రి రోడ్డులోని సాయిశివానీ కల్యాణ మండపం సమీపాన ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదస్థితిలో మోటారు సైకిల్‌పై వెళుతుండగా వారిని సీఐ లింగప్ప, ఎస్ఐ రామకృష్ణ సిబ్బంది పట్టుకున్నారని తెలిపారు. వీరిని విచారించగా పెద్దముడియం మండలం నెమళ్లదిన్నెకు చెందిన జంబులదిన్నె బాలక్రిష్ణ ప్రస్తుతం ప్రొద్దుటూరు శ్రీనివాసనగర్‌లో నివాసం ఉంటున్నారు. అలాగే చింతకాయల హుస్సేన్ బాషగా గుర్తించారని తెలిపారు. వీరిని పూర్తి స్థాయిలో విచారణ చేయగా గత ఆరు నుంచి 7 నెలలుగా ఆలయాలను టార్గెట్‌గా చేసుకొని చోరీలకు పాల్పడినట్లు తేలిందన్నారు. వారు మొత్తం 26 కేసుల్లో నిందితులుగా ఉన్నారన్నారు. ప్రస్తుతం వీరి వద్ద నుంచి 20 గ్రాముల బంగారు, 9.40 కేజీల వెండి ఆభరణాలు (ఆలయాల అమ్మవారి) స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. మొత్తం వస్తువులు రూ.12 లక్షలు విలువ అవుతాయని తెలిపారు. విచారణలో సుమారు 26 కేసులకు సంబంధించి జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు, కర్నూలు, యాడికి, బనగానపల్లి, ఆళ్లగడ్డ తదితర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్లు తేలిందన్నారు. పట్టుబడిన ఇద్దరి నిందితులను కోర్టుకు హాజరుపరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు.

పీజీ విద్యార్థులకు నూతన సిలబస్ రూపకల్పన



బీఓఎస్ చైర్మన్‌లతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రఘునాథ్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యావిధానం- 2020 ప్రకారం లెటరల్ ఎంట్రీ పోస్ట్‌గ్రాడ్యుయేషన్ కోర్సులకు నూతన సిలబస్ రూపకల్పన చేయనున్నట్లు వైవీయూ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి వెల్లడించారు. శుక్రవారం విశ్వవిద్యాలయంలోని తన చాంబర్‌లో వైవీయూ అకాడమిక్ డీన్ ఆచార్య చంద్ర ఓబుళరెడ్డి, అసోసియేట్ డీన్ డాక్టర్ వసుగోవర్ధన్‌రెడ్డి, వివిధ కోర్సుల బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌లతో ప్రిన్సిపల్ సమావేశమయ్యారు. ఈసందర్భంగా కొన్ని కోర్సులకు పాత సిలబస్, కొన్ని కోర్సులకు కొత్త సిలబస్ ఉందని తెలిపారు. అందరి అభిప్రాయాల మేరకు ఏకరూపంలో నూతన సిలబస్ రూపొందించాలని నిర్ణయించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి నూతన సిలబస్ అమలు చేయనున్నామన్నారు.


అవినీతికి పాల్పడిన ఇద్దరు విద్యుత్ ఉద్యోగులు సస్పెన్షన్

కడప నాగరాజుపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు సబ్ ఈఆర్‌ఓ కార్యాలయంలో అవినీతికి పాల్పడిన ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈఆర్వో కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ యం.సుజిత్ విద్యుత్ బిల్లుల ద్వారా వచ్చిన రూ.16,59,944 నగదును బ్యాంకులో సంస్థ అకౌంట్‌కు జమచేయకుండా అవినీతికి పాల్పడ్డారు. గత నాలుగు నెలల నుంచి అతనిపై పర్యవేక్షణ చేయనుందుకు జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ సీహెచ్ విజయబాబును సస్పెండ్ చేశామని తెలిపారు. సంస్థకు నష్టం కలిగించే పనులకు పాల్పడితే ఎంతటి వారైన శాఖపరమైన చర్యలు తప్పవని ఎస్ఈ హెచ్చరించారు.

అక్రమంగా సిమెంట్ అమ్మకాలు

● కొందరు సిమెంట్ ట్యాంకర్ల డ్రైవర్లతో కుమ్మక్కై గుర్రంకొండలో లూజ్‌గా విక్రయిస్తున్న వైనం ● నష్టపోతున్నామంటున్న వ్యాపారులు

గుర్రంకొండ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండలో అక్రమంగా సిమెంట్ అమ్మకాలు జరుగుతున్నా పట్టించుకునేవారు లేరు. దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామంటూ మండలంలోని సిమెంట్ వ్యాపారులు లబోదిబోమంటున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన ఫలితంలేదంటూ వాపోతున్నారు. దీనికితోడు సిమెంట్ ధరలు అధికంగా ఉండడంతో సామాన్య ప్రజలకు ఇంటి నిర్మాణం కలగా మారింది. దీనికి తోడు ఐరన్ కమ్మీ, ఇసుక, కూలీల ధరలు రోజురోజుకు పెరుగుతూ ఉండడంతో మధ్య, పేదలు సొంతింటి కల నెరవేరడం లేదు. సిమెంట్ ఎక్కువ భాగం కడప జిల్లా ఎర్రగుంట్ల నుంచి వివిధ రాష్ట్రాలు, దేశాలకు రవాణా చేస్తున్నారు. ఈ క్రమంలో ఎర్రగుంట్ల నుంచి ప్రతిరోజు పదుల సంఖ్యలో సిమెంట్ ట్యాంకర్లు గుర్రంకొండ మీదుగా బెంగుళూరుకు వెళుతున్నాయి. ఈ ట్యాంకర్లలోని సిమెంట్‌ను కొంత మంది డ్రైవర్లు అక్కడక్కడ వాహనాలను ఆపి విక్రయిస్తున్నారు. ట్యాంకర్లలోని సిమెంట్‌ను సంచులకు నింపి మార్కెట్ ధరల కంటే రూ.50 నుంచి 80 వరకు తగ్గించి అమ్ముతున్నారు. దీంతో ఈ లూజ్ సిమెంట్‌కు గుర్రంకొండ మండలంలో మంచి గిరాకీ ఉంది. ఇదే అదునుగా భావించిన కొందరు వ్యాపారులు లూజ్ సిమెంట్ వ్యాపారం నిర్వహిస్తూ సొమ్ము చేసుకొంటున్నారు. గుర్రంకొండ మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ పరిధిలోని సూరప్పగారిపల్లె, కోన క్రాస్ వద్ద ఈ లూజ్ సిమెంట్ వ్యాపారం జోరుగా జరుగుతోంది. ఇందు కోసం వ్యాపారులు సూరప్పగారిపల్లె, కోన క్రాస్ వద్ద రేకుల షెడ్లను ఏర్పాటు చేశారు. సిమెంట్ ట్యాంకర్లు రాత్రి పూట ఎర్రగుంట్ల నుంచి బెంగుళూరుకు వెళుతూ మార్గ మధ్యంలోని సూరప్పగారిపల్లె, కోన క్రాస్ వద్ద ఉన్న రేకుల షెడ్ల వద్దకు చేరుకొంటాయి. ఓ సిమెంట్ ట్యాంకర్ నుంచి 50 నుంచి 100 బస్తాల వరకు సిమెంట్‌ను తీసి ఖాళీ సంచులో నింపి అప్పటికప్పుడే తక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. ఈ లూజ్ సిమెంట్‌ను వ్యాపారులు నిర్మాణదారుల ఇంటి వద్దకే చేరుస్తుండడం కొసమెరుపు. ఇలా ప్రతి రోజు పదుల సంఖ్యలో సిమెంట్ ట్యాంకర్లు ద్వారా లూజ్ సిమెంట్‌ను వేలాది రూపాయలకు అమ్ముతున్నారు. సుమారు పది నుంచి 20 లారీల్లో సిమెంట్‌ను లూజ్‌గా తీసి అమ్మేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ లూజ్ సిమెంట్ అమ్మకాలను కొందరు వ్యాపారంగా మలుచుకుని అక్రమార్జన చేస్తున్నారు. కాగా లూజ్ సిమెంట్ అమ్మకాలపై చర్యలు తీసుకోవాలని పట్టణంలోని సిమెంట్ వ్యాపారులు పోలీసులకు తమ సమస్యలను తెలుపుతూ ఫిర్యాదు చేసిన అటు వైపు వారు కన్నెత్తి చూడడం లేదని వాపోతున్నారు. దీంతో ఏడాదికి వేలాది రూపాయలు టాక్స్‌లు చెల్లించి వ్యాపారం చేయడం కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


అక్రమ సిమెంట్ అమ్మకాల కోసం ఏర్పాటు చేసిన షెడ్లు

లూజ్ సిమెంట్ అమ్మకాలపై చర్యలు తీసుకొంటాం

అక్రమంగా సిమెంట్ అమ్మకాలు చేస్తున్న వ్యాపారులపై నిఘా ఉంచాం. ట్యాంకర్ల నుంచి సిమెంట్ తీసి తక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. చెర్లోపల్లెలో లూజ్ సిమెంట్ వ్యాపారంపై చర్యలు తీసుకొంటాం.

-మదు రామచంద్రుడు, ఎస్ఐ, గుర్రంకొండ

సబ్‌కలెక్టర్ జోక్యంతో బస్‌షెల్టర్ వివాదానికి తెర

● కొత్త భవనాల నిర్మాణానికి కమిషనర్ పల్లవి భూమిపూజ


నూతన భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టిన కమిషనర్ జీవీ పల్లవి

బి.కొత్తకోట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ జోక్యంతో బి.కొత్తకోట పట్టణ నడిబొడ్డున జ్యోతిసర్కిల్‌లో వద్ద బస్‌షెల్టర్ విషయంలో నెలకొన్న వివాదానికి తెరపడింది. దీంతో నగరపంచాయతీ కమిషనర్ జీవీ పల్లవి శుక్రవారం రెవెన్యూ, పోలీస్‌సిబ్బంది సహకారంతో నూతన భవనాల నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు కూడా ప్రారంభించడం చకచకా జరిగిపోయాయి. ఏళ్లతరబడి పట్టణంలోని జ్యోతిసర్కిల్‌తో పాటు ప్రధాన రోడ్లకు ఇరువైపుల ఉన్న డ్రైనేజీలను ఆక్రమించుకొని పలువురు వ్యాపారాలు చేసుకునేవారు. కమిషనర్‌గా పల్లవి బాధ్యతలు చేపట్టగానే ఆక్రమణలపై దృష్టిసారించి ఎక్స్‌కవేటర్లతో ఆక్రమణలను తొలగించారు. ఇందులో భాగంగా జ్యోతిసర్కిల్‌లో దశాబ్దాల క్రితం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్మించిన బస్‌షెల్టర్, వాటర్‌ట్యాంక్ చుట్టుపక్కల ప్రదేశం కబ్జాదారుల నుంచి విముక్తి పొందాయి. ఆ కాలంచెల్లిన బస్‌షెల్టర్ తొలగించి, ప్రజాసౌకర్యార్థం ఆధునిక మరుగుదొడ్లను నిర్మించాలని ఇటీవల ప్రయత్నించగా కొందరు ఆ స్థలం తమదంటూ అడ్డుతగిలారు. దీంతో తాత్కాలికంగా బ్రేక్‌పడింది. దీనిపై మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌కు ఫిర్యాదు వెళ్లడంతో ఆయన స్పందించి సర్వేయర్‌ను పంపి, నిర్మాణానికి సహకరించాలని, ఎవరైనా అడ్డొస్తే క్రైం జీవర్ కేసు నమోదు చేయాలని తహశీల్దార్ అజారుద్దీన్‌ను ఆదేశించారు. నగర పంచాయతీ అధికారులు పోలీసులకూ ఫిర్యాదు చేశారు. దీంతో వివాదానికి తెరపడి నూతన భవనాలకు భూమిపూజచేసి పనులు ప్రారంభించారు.

బీవోటీ విధానంలో లీజుకు..

బి.కొత్తకోట జ్యోతిసర్కిల్‌లో పురాతన భవనం స్థలంలో భవన నిర్మాణానికి నగరపంచాయతీ అధికారులు బీవోటీ(బిల్డ్ ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్) ప్రాతిపదికన ఒప్పందం కుదుర్చుకున్నారు. అన్నమయ్య జిల్లా సుండుపల్లికి చెందిన జీవీపీ రమణ ఫౌండేషన్ ప్రతినిధి రవిప్రకాష్ ఈ నిర్మాణాన్ని చేపట్టి, ఒప్పందం మేరకు కొన్నేళ్లు ఆధునిక మరుగుదొడ్లు నిర్మించి నిర్ణీత రుసుం వసూలు చేసుకొని, అనంతరం భవనాన్ని నగరపంచాయతీకి అప్పగిస్తారు. వాటర్‌ట్యాంకు చుట్టూ ప్రహరీని నిర్మించి, వాహనస్టాండ్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు కమిషనర్ జీవీ పల్లవి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏవో రమాదేవి, వీఆర్‌వోలు శ్రీరాములు, మల్లికార్జున, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

● సీఎం చంద్రబాబుకు వినతి


సీఎంకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఎం చంద్రబాబుకు గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గుడి నాగరాజ, అన్నపూర్ణఆచారి విన్నవించారు. గురువారం రాత్రి విజయవాడలోని రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబును అసోసియేషన్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ప్రొబేషన్ పీరియడ్‌లో ఉన్న మూడేళ్లకు 3 నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, సచివాలయ ఉద్యోగులకు జాబ్‌చార్ట్ కేటాయించాలని కోరారు. సచివాలయ ఉద్యోగులకు విద్యార్హత ఆధారంగా వారిని మాతృశాఖలో నియమించాలని కోరారు. కొంత మంది అధికారులు కొన్ని జిల్లాలో సచివాలయ ఉద్యోగులకు సెలవులు ఇవ్వడం లేదని, జీతాల బిల్లులు పెట్టడం లేదని ఫిర్యాదు చేశారు. వారి విన్నపాలను సీఎం పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

అనారోగ్య బాధితులకు సీఎంఆర్ఎఫ్ చేదోడు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురైన పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ చేదోడుగా నిలుస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం మదనపల్లె మండలం, పట్టణంలోని ఆరుగురికి రూ.7.80 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే మదనపల్లె నియోజకవర్గంలోని పేద ప్రజలకు సీఎంఆర్ఎఫ్ కింద రూ.1.50కోట్లు విడుదల చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నేత శ్రీరామరామాంజనేయులు, టీడీపీ నాయకులు నవీన్‌చౌదరి, చిన్నమహేష్ తదితరులు పాల్గొన్నారు.

పీలేరు హెచ్‌డీటీ బదిలీ

పీలేరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పీలేరు మండలం హెచ్‌డీటీగా పనిచేస్తున్న రెడ్డప్ప రెడ్డి శుక్రవారం బదిలీ అయ్యారు. ఆయనను పీలేరు నుంచి డిప్యూటేషన్‌పై కలెక్టరేట్‌లోని ప్రోటోకాల్ విభాగానికి బదిలీ చేస్తున్నట్లు శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. పీలేరులో గురువారం జరిగిన ఆక్రమణల తొలగింపులో కలెక్టర్‌కు చేదోడువాదోడుగా ఉన్న డీటీ రెడ్డప్ప రెడ్డి ఆకస్మిక బదిలీ శుక్రవారం పీలేరులో చర్చనీయాంశం అయ్యింది. రాజకీయ కారణాలతోనే ఆయన బదిలీ జరిగిందనే వదంతులు వినిపిస్తున్నాయి.

విశ్రాంతి బల్లలు ఏర్పాటు



తంబళ్లపల్లె, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండల కేంద్రంలో పలు చోట్ల మాజీ మల్లయ్యకొండ చైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి తన సొంత నిధులతో ప్రజల సౌకర్యార్థం సిమెంటు విశ్రాంతి బల్లలు ఏర్పాటు చేయించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, ఉన్నత పాఠశాలలో, పాత కళాశాల మైదానంలో సుమారు రూ.1.20 లక్షలతో సిమెంటు విశ్రాంతి బల్లలను ఏర్పాటు చేశారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసిన బల్లలను వైద్యులు, ప్రజలతో కలసి మద్దిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థులు, ప్రజలు, రోగుల సౌకర్యార్థం సిమెంటు బల్లలు ఏర్పాటు చేయిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మల్లయ్యకొండ కింద ఉన్న కమ్యూనిటీ హాలును సుమారు రూ.2లక్షల సొంత నిధులతో మరమ్మతు పనులు చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మెన్ శివకుమార్, పీర్ల మాబు, స్థానికులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నలవీరగంగాభవానీ జాతర

● భక్తులతో పోటెత్తిన ఆలయం ●ప్రత్యేక ఆకర్షణగా చాందినీ బండ్లు


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం సీటీఎం గ్రామంలో వెలసిన నలవీరగంగాభవానీ అమ్మవారి జాతర తిరుణాల అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. జాతర పురస్కరించుకుని గ్రామాల నుంచి చాందినీ, అన్నం, టెంకాయ పట్ల బండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆలయ ప్రాంగణం జనాలతో కిక్కిరిసిపోయింది. మదనపల్లె మండలం, కొండామారిపల్లె గ్రామం, వెంకటప్ప కోటకు చెందిన రొంపిచెర్ల పోతప్ప అనే టీడీపీ కార్యకర్త సీఎంగా చంద్ర బాబునాయుడు అధికారం చేపట్టిన సందర్భంగా చాందినీ బండి కట్టి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నాడు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది చాందినీ బండ్లు ఎక్కువగా కట్టారు. జాతర సందర్భంగా పొరు గు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ నుంచే కాకుండా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అనంతపురం, సత్యసాయి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వివిధ గ్రామాల నుంచి మహిళలు దీలు, బోనాలను ఊరేగింపు తరలివచ్చి గంగ మ్మకు సమర్పించారు. భక్తుల దర్శనం కోసం ఆలయకమిటీ సభ్యులు ప్రత్యే క దర్శనం, క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అదే విధంగా అమ్మవారి ఆల యం ముందర పొట్టేళ్లు, మేకపోతులను బలిచ్చారు. మదనపల్లె ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యేక సర్వీసులు జాతరకు నడిపారు. సీటీఎంలోని హరి డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో 30మందిపైగా వలంటీర్లు భక్తులకు సేవలందించారు. మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు ఆధ్వ ర్యంలో మదనపల్లె తాలుకా సీఐ కళా వెంకటరమణ పర్యవేక్షణలో తాలుకా ఎస్ఐలు చంద్రమోహన్, హరిహరప్రసాద్‌తోపాటు 100మంది పోలీసులు ఎక్కడా అవాంఛనీయమైన సంఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీగా బందోబస్తు నిర్వహించారు. ఆలయకమిటీ సభ్యులు సీటీఎం సర్పంచ్ సగినాల ఆనంద పార్థసారథి, పొరపట్ల సురేంద్రరెడ్డి, వెలుగుచంద్ర, పోగాకు వీరప్రతాప్‌లు భక్తులకు కావాల్సిన సౌకర్యాలను సమకూర్చారు.

గంగమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): సీటీఎంలో వెలసిన నలవీరగంగమ్మ జాతర సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అమ్మవారిని దర్శించుకున్నారు. శుక్రవారం రాత్రి తిరుణాళ్ల సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా గంగమ్మ ఆలయానికి చేరుకుని పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జునైద్‌అక్బారి, రెడ్డిరామ్‌ప్రసాద్, చల్లా నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

పూల్వామా అమర వీరులకు ఘన నివాళి


పూల్వామా అమరవీరులకు నివాళులర్పిస్తున్న పీలేరు వాసులు

పీలేరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పూల్వామా ఘటనలో అశువులు బాసిన సైనికులకు శుక్రవారం పీలేరులోని మాజీ సైనికోద్యోగులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, పీలేరు యూత్ క్లబ్ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నాలుగు రోడ్ల కూడలిలో 'పూల్వామా వీరులు అమర్ రహే' అంటూ నినాదాలు చేశారు. పొరుగు దేశం ఎన్ని కుట్రలు పన్నినా భారతదేశ సైనికుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరన్నారు. అంతకుమునుపు శుక్రవారం ఉదయం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద సంజయ్ గాంధీ డిగ్రీ కళాశాల విద్యార్థులు పూల్వామా అమర వీరుల సంస్మరణార్థం ర్యాలీ నిర్వహించారు. బీసీ రెడ్డప్ప, మిట్టమీద శివ, మధు, హరీశ్, ధన, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె టౌన్: పుల్వామా వద్ద ఉగ్రదాడిలో అశువులువీడిన అమర జవానులకు ఏబీవీపీ నాయకులు నివాళులర్పించారు. శుక్రవారం స్థానిక రంగనాథ ఐటీఐ నుంచి ఏబీవీపీ నాయకులు అమర జవానుల ఫొటోల బ్యానర్ చేతపట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నగర కార్యదర్శి కిశోర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 14వ తేది దేశచరిత్రలో చీకటి రోజు అన్నారు. ఆనాడు అశువులుబాసిని 40 మంది వీర జవానుల ఆత్మ శాంతించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మోహనరాజు, పురుషోత్తం, రఘు, నరసింహులు, రెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కురబలకోటలో: దేశరక్షణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కల్పన పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో పుల్వామా దాడికి నిరసనగా బ్లాక్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన వీర జవానుల త్యాగాలు వెలకట్టలేనివని కొనియాడారు. అనంతరం వీర జవానుల ఆత్మశాంతికి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ లెఫ్టినెంట్ నవీన్‌కుమార్, శరవణ ముత్తు, ఎన్‌సీసీ క్యాడెట్స్ తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు శుక్రవారం పూల్వామా అమరుల ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ... మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం రెడ్డప్పరెడ్డి మాట్లాడుతూ..ప్రతి విద్యార్థి దేశ భక్తి కలిగి ఉండాలన్నారు. దేశ రక్షణ కోసం కాపాలా కాస్తూ ఉగ్రవాదుల చేతిలో అమరులైన వీర జవాన్ల త్యాగం మరు వలేనిదన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోర్టులో గంగమ్మకు ప్రత్యేక పూజలు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : స్థానిక కోర్టులో వెలసిన గంగమ్మకు శుక్రవారం ఆలయకమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. మహిళలు అమ్మవారికి చీర, జాకెట్లు, పొంగళ్ల నైవేద్యం సమర్పించారు. ఆలయకమిటీ అధ్యక్షుడు మార్పురి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు కార్యదర్శి ప్రభాకర్‌నాయుడు, రంగస్వామినాయుడు, కరుణాకర్‌నాయుడు, విక్కీ, మహేష్, దేవేంద్ర, శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి

వాల్మీకిపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టులో మార్చి 8న జరగనున్న జాతీ య లోక్ అదాలత్‌లో ప్రతి ఒక్కరూ ఎక్కువ కేసుల పరి ష్కారమే లక్ష్యంగా పనిచేయా లని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి భారతి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కోర్టులో జాతీయ లోక్‌అదాలత్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కక్షిదారులకు అవగాహన కల్పించి దీర్ఘకాలిక కేసులు సైతం జాతీయ లోక్ అదాలత్ వేదికగా పరిష్కారం అయ్యే విధంగా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం స్థానిక అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఆమె ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి విద్యార్థులకు అందుతున్న వసతి సౌకర్యాలపై వివరాలు ఆరా తీశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తూ మరింత నాణ్యతగా ఆహారం అందించాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు, వివిధ శాఖల అధికారులు, బ్యాంకు మేనేజర్లు, న్యాయవాదులు, మండల న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ అర్జీలను సత్వరమే పరిష్కరించాలి


పీలేరులో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ప్రత్యేక అధికారిణి రమ

పీలేరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్) ద్వారా అందిన అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని పీలేరు మండల ప్రత్యేక అధికారిణి రమ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. పీజీఆర్ఎస్, రీసర్వే, రెవెన్యూ సదస్సుల్లో అందిన అర్జీల పరిష్కారంపై శుక్రవారం ఆమె తహసీల్దారు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీజీఆర్ఎస్, రెవెన్యూ సదస్సుల్లో పీలేరు మండలంలో మొత్తం 751 అర్జీలు అందగా వాటిలో 204 మాత్రమే పరిష్కారమయ్యాయని, 547 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అర్జీల పరిష్కారంలో పీలేరు మండలం బాగా వెనుకబడి ఉందని, మరో 15 రోజుల్లో అర్జీలన్నింటినీ పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు భీమేశ్వర రావు, డీటీ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

యాసిడ్ దాడికి పాల్పడిన గణేష్‌ను శిక్షించాలి



మదనపల్లెలో నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు


మదనపల్లె అర్బన్, ఫ్రిబవరి 14(ఆంధ్రజ్యోతి): యువతిపై యాసిడ్ దాడికి పాల్పడిన గణేష్‌ను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రజా సంఘాలు మదనపల్లె జిల్లా ఆస్పత్రి వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ డిగ్రీ చదువుకుని స్వయం ఉపాధి పొందుతున్న యువతి ప్రేమించలేదని ఉన్మాదంతో ప్రేమికుల రోజే కత్తితో పొడిచి, ముఖంపై యాసిడ్ పోసి దాడి చేయడం దారుణమన్నారు. బాధిత యువతికి మెరుగైన వైద్యం అందించాలని, వైద్యఖర్చులు భరించాలని, బాధిత యువతి కుటుంబసభ్యులకు 25 లక్షల రూపాయలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కన్వీనర్ భాగమ్మ, సీపీఎం నాయకుడు నాగరాజు, సీఐటీయూ నాయకులు రెడ్డిప్రసాద్, వెంకటేశ్, ఆటో నాయకులు శ్రీప్రసాద్, వెంకటశివ, రెడ్డిప్రసన్న, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకలుఉ సాంబశివ, నాయక్ పాల్గొన్నారు.

మదనపల్లెలో బీఎస్పీ బైక్‌ర్యాలీ



మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడుగా బందెల గౌతమ్‌కుమార్ నియమించినందుకు శుక్రవారం మదనపల్లెలో బహుజన సమాజ్ పార్టీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్ష పదవి మదనపల్లెకు చెందిన నాయకుడికి ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలాజీ, ఫనీ, వర్మ, శేఖర్, ఇబ్రహీమ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత


అడవులు సంరక్షించడంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అడవులను సంరక్షించుకోవడం అందరి బాధ్యత అని అటవీ శాఖ ఎఫ్‌బీవో రామరాజు, ఎఫ్ఎస్‌వో రెడ్డివరప్రసాద్‌లు పేర్కొన్నారు. శుక్రవారం తంబళ్లపల్లె మండల కేంద్రంలో అడవుల వలన కలిగే ఉపయోగాలు, వన్యప్రాణుల ప్రాముఖ్యత, అడవులకు నిప్పుపెట్టడం వలన కలిగే అనర్థాలపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...అడవులతోనే మానవ మనుగడ ఆధారపడి ఉందన్నారు. ప్రతి ఒక్కరూ అడవులు, వన్యప్రాణులను సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రెడ్డప్ప రెడ్డి, మెడికల్ స్టోర్ నారాయణరెడ్డి, పోర్లు నసింహులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలకు నేటితో గడువు పూర్తి

పెద్దమండ్యం,ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు గడువు ఈ నెల 15వ తేదీతో పూర్తి అవుతోందని ఎంపీడీవో శ్రీధర్ రావు తెలిపారు. అర్హులందరూ బీసీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్ చేసిన దరఖాస్తులు శనివారం ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తుదారులు అందజేయాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మదనపల్లె డివిజన్‌లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో నిర్వహించిన ఇంటర్వ్యూలకు 62 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారి విద్యార్హత, నేటివిటీతో పాటు పలు ప్రశ్నలు అడిగిన సబ్‌కలెక్టర్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. మదనపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టులో 15, వాల్మీకిపురం ప్రాజెక్టులో 8, తంబళ్లపల్లె ప్రాజెక్టులో 14, బి.కొత్తకోట ఐసీడీఎస్ ప్రాజెక్టులో 9 కలిపి మొత్తం 46 అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నోడల్‌ఆఫీసర్ ప్రమీల, డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్, సీడీపీవోలు సుజాత, నాగవేణి, భాగ్యమ్మ, భారతి పాల్గొన్నారు.

సంజీవయ్య ప్రస్థానం స్ఫూర్తిదాయకం


సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మదనపల్లె, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): సంపద లేకుండా జీవించిన అతికొద్ది మంది రాజకీయ వేత్తల్లో దామోదరం సంజీవయ్య ఒకరని ఆయన ప్రస్థానం నేటి పాలకులకు స్ఫూర్తిదాయకమని వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక బాస్ కార్యాలయంలో శుక్రవారం ఉమ్మడి ఏపీ రెండో ముఖ్యమంత్రిగా పనిచేసిన దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ కర్నూలు నగరంలో నేడు అంతర్భాగంగా ఉన్న కల్లూరు మండలం పెద్దపాడు గ్రామంలో ఒక సామాన్య దళిత కుటుంబంలో జన్మించారని, ఆయన ఉన్నత విద్యావంతుడని పేర్కొన్నారు. నేటి ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు, యువత ఆయన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని పీటీఎం శివప్రసాద్ సూచించారు. కార్యక్రమంలో వీసీకే, బాస్ నాయకులు ముత్యాల మోహన్, సి.బయన్న, బురుజు రెడ్డిప్రసాద్, రవిశంకర్, తలారి కృష్ణ, వై.గంగాధర్, రాయల్ సూరి, బి.నరసింహులు, భైనేని సురేష్, రవిప్రకాష్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

కోళ్లఫారాల వద్ద పరిశుభ్రత పాటించాలి


కోళ్లఫారం యజమానులకు సూచనలు ఇస్తున్న డాక్టర్ సురేష్

నిమ్మనపల్లి ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోళ్లఫారాల వద్ద యజమానులు పరిశుభ్రత పాటిస్తే ఎలాంటి జబ్బులు దరిచేరవని పశు వైద్యాధికారి సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాలో బర్డ్‌ఫ్లూ సోకిన నేపథ్యంలో పశుసంవర్ధక శాఖ డైరక్టర్ ఆదేశాలతో 29 కోళ్లఫారాలను తనిఖీ చేపట్టినటు చెప్పారు. కోళ్ల ఫారాల యజమానులు ఎప్పటి కప్పుడు ఫారాలను పరిశు భ్రంగా ఉంచుకోవాలని చనిపోయిన కోళ్లను ఖచ్చితంగా జనావాసాలకు దూరంగా గుంత తీసి పూడ్చి పెట్టి అక్కడ బ్లీచింగ్ చల్లాలన్నారు. ప్రజలు బర్డ్‌ఫ్లూ వలన ఆందోళన చెందరాదని ఒక వేళ చికెన్, గుడ్లు తినే వారు బాగా ఉడకబెట్టి వాటిని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ప్రతాప్, మునీంద్ర, శాంతి తదితరులు పాల్గొన్నారు.

ఉలిక్కిపడ్డ ప్యారంపల్లె..?!

గుర్రంకొండ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి):మండలంలోని ప్యారంపల్లె గ్రామానికి చెందిన యువతిపై ప్రేమోన్మాది యాసిడ్ పోసి, కత్తితో విక్షణారహితంగా పొడవడంతో గ్రామంలో ప్రజలు, మహిళలు ఉలిక్కిపడ్డారు. గ్రామానికి చెందిన యువతి గౌతమిపై గణేష్ ఇంటిలోకి చొరబడి ఘాతుకానికి పాల్పడడం గ్రామంలో ఆందోళన కలిగిస్తుంది. ప్రేమోన్మాది గణేష్ పదిహేను రోజుల క్రితమే గ్రామంలోకి వచ్చి యువతి ఇంటి పరిసరాలను రెక్కీ చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో యువతి తల్లిదండ్రులు పశువుల వద్ద పాలు పితకడానికి ఉదయం 6.30 గంటలకు పొలం వద్దకు వెళ్లారని అప్పటికే గ్రామానికి చేరుకొన్న గణేష్ యువతి ఇంటిలోకి ప్రవేశించి ఆమెపై దాడి చేయడంతో మహిళలు భయభ్రాంతులు చెందుతున్నారు.

ఉలవ పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి


రైతులతో సమావేశమై మాట్లాడుతున్న రైతు సంఘం నేత రంగారెడ్డి

ములకలచెరువు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉలవ పంటకు మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమల్ల రంగారెడ్డి, సహాయ కార్యదర్శి అంజనప్పలు డిమాండ్ చేశారు. ములకలచెరువులో శుక్రవారం రైతులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమం లో వారు మాట్లాడుతూ ఉలవకు గతంలో క్వింటాల్ రూ.6వేల వరకు ఉండేదని, ప్రస్తుతం పంట బాగా పండడంతో రూ.3200 మాత్రమే ఉందన్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఉలవకు మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున, నాయకులు వేమన్న, రమణ పాల్గొన్నారు.

పంచాయతీకి రూ.1.42 లక్షలు ఆదాయం

గుర్రంకొండ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి):గుర్రంకొండ పంచాయతీకి చేపల చెరువు వేలం పాట ద్వారా రూ.1.42 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈవో హరిబాబు తెలిపారు. పట్టణంలోని చిన్నరాజుకుంటకు పంచాయతీ అధికారులు చేపలు పట్టుకోవడానికి శుక్రవారం వేలం నిర్వహించారు. ఈ వేలం పాటను సయ్యద్ గయాజ్ అహ్మద్ రూ.1,42,000 లక్షలకు దక్కించుకొన్నట్లు ఈవో తెలిపారు.